ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
27 మార్చి, 2011

వెబ్'డబ్'

హ్యాపీ బర్త్‌డే

(2011 మార్చి 27 నుంచి
2011 ఏప్రిల్ 2 వరకు)

వై. ప్రభుదీపిక
11సం॥, మార్చి-27
సుజాత-రత్నం
రామరాజుపల్లి-కడప

ప్రణయ
3సం॥, మార్చి-29
శారద-గోపాల్
పొల్కెపాడ్-మ॥నగర్

కె. శ్రావ్య
3సం॥, ఏప్రిల్-1
రాధిక-రమేష్
పామర్రు-కృష్ణా

అఖిల
మార్చి-27
శోభ-వంశీ
ఇల్లందు-ఖమ్మం

నమన్వి
ఏప్రిల్-1
హారిక-మధు
విజయవాడ

కె. శ్వేత
5సం॥, మార్చి-28
విజయలక్ష్మి-ప్రసాద్
కామేపల్లివారిపాలెం-ప్రకాశం

ఎం. మనోజ్(లడ్డు)
1సం॥, మార్చి-30
లక్ష్మి-గోవర్ధన్
అర్సపల్లి-నిజామాబాద్

వి. అజిత
మార్చి
మేరీకృప-జాన్ బన్ని
బొమ్మూరు-తూ॥గో॥

ఆర్. భవ్య
7సం॥,మార్చి-2003
భారతి-గురుప్రసాద్
ఎమ్మిగనూరు

ఆర్. వంశీకృష్ణ
12సం॥,మార్చి-1999
భారతి-గురుప్రసాద్
ఎమ్మిగనూరు

సుమంత్(చిన్ను)
మార్చి-31
పద్మ-వీరారెడ్డి
విద్యానగర్-నల్లగొండ

ఎ. శ్వేత
మార్చి-28
సూర్యకళ-ప్రసాదరావు
శ్రీకాకుళం

యు. గీతాంజలి
మార్చి
వెంకమ్మ-లక్ష్మణస్వామి
కల్లూరు-కర్నూలు

జి. నవదీప్
1సం॥, ఏప్రిల్-1
నిరీక్షణ-ప్రభాకర్
కైకొండాయగూడెం-ఖమ్మం

నక్షత్ర(స్వీటీ)
మార్చి
అరుణ-అరవింద్
చంద్రుగొండ-ఖమ్మం

ఎం. కల్యాణ్
మార్చి-31
బుజ్జి-సాంబయ్య
కాజ-గుంటూరు

మనలో మాట

వధువు కావలెను

ఈ ఎండాకాలంలోనైనా అబ్బాయికి పెళ్లి చేయగలమో లేదోనని తల్లిదండ్రులు బెంగపడిపోయే రోజులొచ్చాయి. 'తగిన' అమ్మాయి కోసం దుర్భిణీలు, కంచు కాగడాలు పట్టుకొని బూట్లు అరిగేలా తిరుగుతున్నారు. మ్యారేజ్ బ్యూరోలనూ వదలకుండా ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఎరుకలో ఏదైనా మంచి సంబంధం వుంటే చెప్పమని అబ్బాయి ఫొటో, వివరాలు పెళ్లి కార్డుల మాదిరి పంచుతున్నారు. 'ఇవన్నీ ఎందుకుగానీ...మంచి అమ్మాయిని చూసి ప్రేమించేయ్‌రా బాబూ! పెళ్లైపోతుంది!!' అని సలహాలిచ్చే గడుసు అమ్మానాన్నలూ వున్నారు. అమ్మాయి కుటుంబంతో స్నేహ హస్తం కలిపితే ఆ తర్వాత సంబంధం కలుపు కోవచ్చనుకునే వారూ వున్నారు. 'శివాజీ'లో రజనీకాంత్ కొచ్చిన ఐడియా అదే కదా. కోడలి కోసం కోటి విద్యలు. గుండెల మీద కుంపటిలా తయారైన కొడుకుని ఓ అమ్మ చేతిలో పెట్టాలంటే కోటి తిప్పలు పడాల్సిన రొజులొచ్చాయి.

ఓడలు బళ్లవడం, బళ్లు ఓడలవ్వడం గురించి చెప్తుంటే విన్నాం. ఇవాళ కళ్లారా చూస్తున్నాం. ఇదివరలో మగపిల్లల తల్లిదండ్రులు ఎంత ఫోజు పెట్టేవారు! దర్జాగా ఇంట్లో కాలిమీద కాలు వేసుకుని కో అంటే కోటి సంబంధాలు వచ్చేవి. సంబంధం కుదిరిన దగ్గర నుంచి అబ్బాయి తరపు వారికి ఎక్కడ లేని గౌరవమర్యాదలు. ఏమాత్రం తక్కువైనా ఎగిరెగిరి పడేవారు. బెట్టు చేసి చేయించుకునేవారు. ఇప్పుడంత లేదు. సీన్ సితారైంది. మొన్న బెంగుళూరులో పెళ్లికొడుకు వాళ్లు విడిది సౌకర్యాలకోసం మరీ బెట్టు చేస్తే పెళ్లికూతురు వాళ్లు చితక్కొట్టేశారు. బెంబేలెత్తిన వరుడు ఓ గదిలో దాక్కొంటే పోలీసులొచ్చి కాపాడాల్సి వచ్చింది.

కట్నం సంగతి తర్వాత. ముందు పిల్ల దొరికితే చాలు. అదే పది లక్షలు అనుకుంటున్నారు. 'మంచి సంబంధం' అయితే కాంపిటీషన్ మరింత ఎక్కువ. రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. విషయం పదిమందికీ తెలిస్తే పిల్లను ఎవరు ఎగరేసుకు పోతారోనని భయం!

అమ్మాయిల తల్లిదండ్రులకు ఐదారు సంబంధాలు చేతిలో వుంటే చాలు. ఒక్కొక్కటే తీరిగ్గా పరిశీలించి పరీక్షించి మరీ పిల్లకు తగ్గ వరుణ్ణి ఎంచుకుంటున్నారు. వెయిటింగ్ లిస్టు, ఆర్‌ఎసి... చివరికి బెర్త్ దొరుకుతుందో లేదోనని అబ్బాయిలకు ఒకటే టెన్షన్. అమ్మానాన్నల మాటా అంతంత మాత్రమే. అమ్మాయిలదే ఫైనల్ మాట. అమ్మాయి ఎక్కడ నో అంటుందోనని పెళ్లికాని ప్రసాదులు ఆందోళన వర్ణనాతీతం.

పిల్ల కోసం పక్క రాష్ట్రాలు పట్టి పోవాల్సి వచ్చినా ఆశ్చర్యం లేదు. హర్యానా, పంజాబ్, ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్రలో ఎప్పటి నుంచో ఈ పనిలోనే వున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటిపోయి కోడలిపిల్లను కొని తెచ్చుకుంటున్నారు. ఇలాగే ఇంకొంత కాలం గడిస్తే మన దగ్గరా అదే సీను.

ఎవరెంత చెప్పినా వినకుండా అబ్బాయి ప్లస్సూ అమ్మాయి మైనస్సూ అన్నారు. అంతా ప్లస్సే కావాలనుకున్నారు. ప్లస్సో మైనస్సో తెల్సుకోడానికి ఎంత డబ్బు పోయడానికైనా రెడీ అయ్యారు. మైనస్సని తెలిసిన మరుక్షణమే వదిలించుకున్నారు. సొంత వేలితో కంటిపాపల్ని పొడుచుకున్నారు. దీంతో చీకటి కమ్ముకొస్తుంటే కళ్లు తెరుస్తున్నారు. కంటిపాపల విలువ తెలిసివస్తోంది.

నీటికోసం యుద్ధాలు జరిగాయో లేదో తెలీదు. కోడళ్ల కోసం రణాలు జరిగినా జరగొచ్చు. వరకట్నం పోయి కన్యాశుల్కం వచ్చినా రావొచ్చు.

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
సినిమా కబుర్లు	...	8
ఎండల్లో హాయ్...హాయ్...		10
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
కొత్త పుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

సమ్‌థింగ్ స్పెషల్ ... 4

సూపర్ మూన్ వచ్చాడు... వెళ్లాడు

రుచి ... 17

స్ట్రాబెర్రీ డిలైట్

వికాసం ... 20

స్కానింగ్ ఓ అద్భుతం!



ఆలోచింపజేసింది

అట్టమీది కథ 'అపర సంజీవని' విశ్లేషణాత్మకంగా ఉంది. జనరిక్ మందులు పనిచేయవనే తప్పుడు ప్రచారం అంత ఆరోగ్యకరం కాదు. ఏది ఏమైనా... లాభాపేక్ష లేకుండా పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని డాక్టర్లంతా జనరిక్ మందులు వాడమని చెప్తారని అభిలషిస్తున్నాం. సబ్బు చప్పరించడం, పుట్టుకతో పళ్లుండడం... వంటి వాటితో 'తెల్సా' ఆకట్టుకుంటోంది. చివరిపేజీలో రంగుల పండుగ హోలీని రంగుల్లో చూసి ఆనందించాం. 'నింగి నేల నాదే...' స్ఫూర్తిదాయకంగా ఉంది. జోక్స్ మాత్రం పేలవంగా ఉన్నాయి. గజరాజుల మీద క్రీడా వినోదం ముచ్చట్లు 'చూద్దామా'లో పరికించగలిగాం. కె.అరుణ అందించిన 'కావేరికి ఏమైంది' చిన్న కథ బావుంది. ఈవారం కవిత్వం పర్వాలేదనిపించింది. 'మనలోమాట' ఆలోచింపజేసింది. నిమ్మకాయలు, కొబ్బరి బోండాలవైపు మనందరం మొగ్గు చూపాల్సిన సమయం వచ్చేసింది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

ముచ్చట గొలిపిన వ్యాసం

రంగుల ప్రపంచం, చరిత్ర విశేషాలు ఆకర్షించాయి. పింక్ సిటీగా పేరొందిన జైపూర్‌లో హోలీ పండుగకు ఏనుగులపై క్రీడలు, అవి చేసే విన్యాసాలు ముచ్చటగొలిపాయి. ఏనుగులే హీరోలు వ్యాసం చదవాలనిపించేలా ఉంది.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం.

చదవాలనిపించింది

మార్చి ఆరవ తేదినాటి స్నేహ సంచికలో 'అట్టమీది కథ' పరీక్షలు... పాఠాలు... వ్యాసంలో ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య గారు క్రమానుగుణంగా కాలంతో పాటు విద్యాబోధన, అందులో జరుగుతున్న మార్పులు, వాటి పర్యావసానాలు విశ్లేషణాత్మకంగా, సరళంగా వివరించారు. 'బుడుగు'లోని ఐదు పాలిచ్చే జంతువులు కథ చదివిన తర్వాత ముళ్లపూడి వెంకట రమణ గారి మిగతా కథలు కూడా తెప్పించుకుని చదవాలనిపించింది. విశ్వేశ్వరశర్మ గారి వ్యాసాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి.

ఖైరి సత్యనారాయణ,
కొత్తగూడెం.

చిత్రాల చరిత్ర

హాస్య నటులతో మనవాళ్లు సినిమాలు తీశారు. అయినా ఈ వ్యవస్థ గురించి, దాని పరిణామాల గురించి ఒక్క సినిమా కూడా వచ్చినట్లు గుర్తులేదు. డెబ్బై అయిదేళ్ల క్రితమే చార్లిచాప్లిన్ దోపిడీ వ్యవస్థ మీద హాస్యంతో కూడిన సినిమా తీశారంటే ఆయన ఆలోచన ఎంత గొప్పదో అర్థమవుతోంది. ముళ్లపూడి వారి కథను ప్రచురించి మనసుకు సంతోషాన్ని రుచి చూపించినందుకు ధన్యవాదాలు. అలాగే 'సినిమా కబుర్లు' ద్వారా బాపూ రమణల చిత్రాల చరిత్రను చూడగలిగాం. చుక్కా రామయ్య గారి వ్యాసం పిల్లలు పెద్దలు ఒకరికొకరు అర్థం చేసుకుని సహకరించుకోడానికి ఉపకరిస్తుంది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట.

అవగాహన కలిగించాలి

'కవర్ స్టోరీ'లో జనరిక్ మందుల గురించి తెలియజేసినందుకు అభినందనలు. ఈ మందుల గురించి చాలా మందికి తెలియదు. ఖరీదు తక్కువైనా ఇవి నాణ్యమైనవంటున్నారు. వైద్య శాస్త్రజ్ఞులు వీటి వివరాలు తెలియజేస్తే బాగుంటుంది. వీటి నాణ్యత, రోగ నివారణ శక్తిపై నమ్మకం కలగాలి. ప్రజలకు విశ్వాసం కలిగితే వీటి వాడకం పెరుగుతుంది. ప్రభుత్వం వివిధ ప్రచార సాధనాల ద్వారా ప్రజలకు వీటిపై అవగాహన కలిగిస్తే బాగుంటుంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.





తెలుసా!

సిగరెట్లతో సింగర్ సిత్రం

ఆర్టిస్టులకు రకరకాల ఉపాయాలు వస్తుంటాయి. ఎలా? అంటే సమాధానం చెప్పడం కుసింత కష్టమే. వస్తుంటాయంతే. జింక్స్ కర్స్ట్ ఆర్టిస్టు వున్నాడా! ఆయన బుర్రలో కూడా పాదరసం లాంటి ఐడియా ఒకటి పుట్టేసింది. సిగరెట్లతో చిత్రాన్ని తయారుచేయొచ్చుకదా అనుకున్నాడు. చేసేశాడు. వావ్! సిగరెట్లతోనా! అనిపిస్తుంది మనలాంటి సామాన్యులకు. మరి...టూత్ పిక్స్, పెన్సిళ్ల, చాక్లెట్లు, బిస్కెట్లతో బొమ్మలు చేయగాలేంది సిగరెట్లతో ఎందుకు చేయలేం అనుకున్నాడో ఏమో చేసేశాడు. ఇదిగో ఇప్పుడు ఇక్కడ కనిపిస్తోంది అదే. బొమ్మలో వున్నది ఫ్రెంచి గాయకుడు సెర్జ్ గెయిన్స్‌బర్గ్. అందుకుగాను మన స్విట్జర్లాండ్ ఆర్టిస్టు 20,000లకు పైగా సిగరెట్లను ఉపయోగించాడు. సరే. చేస్తే చేశాడు. ఇప్పుడు ఆయన బొమ్మ చేయడంతో ఆంతర్యం ఏవిటీ? అంటే ...పారిస్‌లో వున్న గొప్ప గాయకులు, గేయ రచయితలు, కళాకారుల్లో గెయిన్స్ బర్గ్ ఒకరు. ఆయన పుట్టిందీ చనిపోయిందీ పారిస్‌లోనే. పైగా ఆయన చనిపోయి ఇప్పటికి 20 సంవత్సరాలైంది. ఆ సందర్భంగా అభిమానులు తమ దగ్గరున్న గెయిన్స్ అరుదైన ఫొటోలను, సంతకాలను ప్రదర్శిస్తున్నారు. సరిగ్గా ఇప్పుడే తను కూడా ఏదైనా ప్రత్యేకంగా చేయాలనుకున్నాడు. తను మూడేళ్లగా సేకరిస్తున్న సిగరెట్ పీకలతో గెయిన్స్ చిత్రం చేసేశాడు. ఇప్పుడది పది మందీ చూసేలా ప్రదర్శన కూడా పెట్టాడు. అదే మన ముందున్న చిత్రరాజం.

వింత గుండె!

'నూటికో కోటికో' అంటుంటామే అది చైనాలో జరిగింది. జింగ్ జింగ్ అనే చిన్నారి అలాంటి అరుదైన పిల్లవాడు. ఎలాగంటారా! వాడి గుండె అందరిలాంటిది కాదు. ప్రత్యేకమైనది. కాళ్లు చేతులకు మల్లే నేను కూడా బయటే ఎందుకు వుండకూడదు. లోపల ఎందుకు మగ్గిపోవాలని అని అనుకుందేమో! ఏకంగా వాడి ఉదర భాగంలో పైకి వచ్చేసింది. పుట్టేటప్పుడే అలా పుట్టాడు. అయితే పొట్టమీద నల్లటి మచ్చలా వుంటే వాడి తల్లిదండ్రులకు అర్థం కాలేదు. పెద్ద ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు చెప్పారు. అది గుండె అనీ...బయటికే కనిపిస్తోందనీ...అయితే ఆరోగ్యంగానే వుందనీ. అమ్మో అవయవాలన్నిటిలోకి ప్రధానమైన గుండె ఇలా బహిరంగంగా కనిపిస్తుంటే ఎవరికైనా భయమేస్తుంది. పొరపాటున దానికేదైనా తగిలితే అంతే సంగతులు కదా అని కూడా అనిపిస్తుంది. కొందరు మాత్రం జింగ్ జింగ్ ఎంతో కాలం బతకడని అనుకుంటున్నారు. అయితే వాడిని పరీక్షిస్తున్న వైద్యులు ధైర్యం చెబుతున్నారు. ప్రస్తుతానికి జింగ్ రెండు నెలల పిల్లవాడే కనుక...మరి కొంత కాలం వరకు అవయవాలు వృద్ధి చెందుతుంటాయి కనుక ... ఆపరేషన్ చేయడానికి ప్రస్తుతానికి వీలవదన్నారు. కొద్ది కాలం గడిస్తే చిన్నారి జింగ్ ఆపరేషన్‌ను తట్టుకోగలుగుతాడని వారి అభిప్రాయం. ఏదేమైనా జింగ్ జింగ్ ఆపరేషన్ విజయవంతం కావాలని వాడు చెంగు చెంగున పరుగెడుతూ ఆడుకోవాలని కోరుకుందాం.



ఎలుగు యోగా

ఉదయాన్నే పార్కుకెళితే యోగా చేసేవారెంతో మంది మనకు దర్శనమిస్తారు. అదే ఫిన్‌లాండ్‌లోని అటారి జూ కెళితే...! మీకు ఓ అద్భుత దృశ్యం కనిపిస్తుంది. తర్వాత నోటెంట మాట రావడానికి చాలా సేపు పడుతుందనుకోండి. ఇంతకీ ఆ అద్భుత దృశ్యకావ్యం ఏంటంటారా! అక్కడ ఓ ఆడ ఎలుగుబంటి ప్రశాంతంగా చెట్టు కింద కూర్చుని యోగా చేస్తుంటుంది. ఈ ఫొటోలు చూశాక కూడా అనుమానం తీరలేదా! రెండు చేతులతో రెండు కాలి బొటన వేళ్లు పట్టుకొని 'వి' ఆకారంలో పెడుతుంది. కాసేపయ్యాక మెల్లగా కాళ్లను యథాస్థానంలోకి తీసుకొస్తుంది. నిదానంగా గాలి పీల్చుకుంటుంది. తర్వాత రెండు కాళ్లనూ దూరంగా పెట్టి చేతులను నేలకు ఆన్చి వుంచుతుంది. ఇలా ప్రతి రోజూ 15 నిముషాల పాటు రకరకాల యోగాసనాలు వేస్తుంది. దీనిని చూడ్డానికి సందర్శకులు తెగ ఎగబడుతున్నారట. ఇవన్నీ చదువుతుంటే మనకే దాన్ని చూడాలనిపించినా ఆశ్చర్యం లేదు. ఔనా!

సూపర్ మూన్ వచ్చాడు... వెళ్లాడు

వారం పదిరోజుల పాటు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేసిన మూన్ (ఆందోళనకు గురి చేసింది సూపర్ మూన్ కాదు, ఆ పేరుతో మనలో కొందరు) ఎప్పటిలా, మామూలుగానే ఉందయించింది, అస్తమించింది. భూగ్రహంపై ఎక్కడా మరో అగ్నిపర్వతం బద్దలు కాలేదు, సముద్రాల లోతు నుండి ప్రకంపనలు వెలువడలేదు. సునామీలు తెగబడలేదు. ఎక్కడా సైక్లోన్లూ, టార్నెడోలూ, హరికేన్లూ పుట్టలేదు. అంతా ప్రశాంతమే.

- డా॥ కాకర్లమూడి విజయ్

సైన్సుకి అంతా తెలుసని కాదు గానీ అది మనల్ని అనవసరంగా ఆందోళనకు గురి చేయదు. కచ్చితమైన ఆధారాలుంటే తప్ప ఎటువంటి ముక్తాయింపుకీ రాదు. ఊహాజనిత విషయాలకు ప్రాధాన్యమివ్వదు. అలాగే, జ్యోతిష్యుల పట్ల మనకేమీ వైరం లేదు. తొలినాటి ఖగోళ శాస్త్రవేత్తలలో కొంతమంది ముందు జ్యోతిష్యులే! విశేషమేంటంటే వారు ముందు జ్యోతిష్యులు, ఆ తర్వాత ఖగోళ శాస్త్రవేత్తలుగా పెరిగారు. ఆస్ట్రానమీ అయినా ఆస్ట్రాలజీ అయినా ఖగోళ శాస్త్రంలో ప్రాథమిక విషయ పరిజ్ఞానం ఉన్నవారికే చెల్లు. ఎవరి జ్ఞానాన్ని వారు పెంచుకున్నా, పంచుకున్నా తప్పేమీ లేదు. కాకపోతే తమ వల్ల, తమ మాట, రాత, చేత, ప్రవర్తన వల్ల ఇతరులకి (సామాన్యులకి) ఇబ్బంది కలిగించకూడదన్నది అలిఖిత మానవీయ సూత్రం. కెమెరాలో కదిలే ఆత్మలూ, చంద్రుణ్ణీ, ఏకంగా సూర్యుణ్ణే మింగేసే రాహువులూ, కాయలూ, ఆకుల్లో దేవుళ్ల ఆకారాలు చూసి ఊగిపోడాలూ, ఉంగరాలూ, రంగు రాళ్లు తొడిగి భవిష్యత్తు మార్చుకోడాలూ, తాయెత్తులూ, పూనకపు మత్తులూ, అంకెలని సంఖ్యా శాస్త్రంగా చేసి లాభపడేవాళ్లూ, పేరు (పేరు అనేది మనిషి ఆవిర్భవించిన తర్వాత పుట్టినదే కదా!) లో అక్షరాలని మార్చేస్తే జీవితం మారుతుందని ఏమార్చే వాళ్లూ, రాసే చేతిరాతలో (కేవలం ఆంగ్లరాతే సుమా!) గీతలూ, వంపులూ చుక్కలూ చక్కగా పెడితే వ్యక్తిత్వమే మారుతుందనే టోకరాగాళ్లూ... ఇంకా అనేక మంది తెలివిగల వాళ్లూ, వాళ్లకు తోడు కొత్తగా పుట్టుకొచ్చిన టీవీ మేధావులూ... గంటకో సారి అరగంట ప్రోగ్రాములంటూ "మీ వూళ్లో దయ్యాలున్నాయా? భూమి ఫలానా రోజున అంతరిస్తుందా? టీ ట్వంటీలో ఫలానా జట్టు ఓటమికి కారణం వారి షర్ట్ మీది బొమ్మేనా? మార్చి పంతొమ్మిదిన భూమికి మూడిందా? కరీంనగర్లో గ్రహాంతరవాసులు దిగారా?" వంటి హడలకొట్టే ప్రశ్నలతో మనబోటి సామాన్యులను పిచ్చివాళ్లను చేసి ఆడిస్తుంటే ఆడడానికి సిద్ధమేనా? కాదు కదా. అందుకే అటువంటి వారి ఆటలు కట్టించే దిశగా ఎదుగుదాం. అటువంటి ప్రేలాపనల్ని ప్రోత్సహించకుండా నిషేధిద్దాం. అందరం ఆలోచిద్దాం.

ప్రతిదీ వింతేనయా!

పూర్ణ చంద్రుడు పున్నమి నాడు కనిపించినా వింతే, అమావాస్య నాడు అదృశ్యమైనా వింతే. గ్రహణం పట్టినా విడ్డూరమే, విడిచినా ఆశ్చర్యమే. మనిషి దానిపై అడుగిడినా సంభ్రమమే, దానిపై నీటి జాడలు కనిపించినా సంబరమే. పసిపిల్లలకు అన్నం తినిపించే 'మామ' అదే. యువతీయువకుల మధ్య ప్రేమలూ, విరహాలూ వివరించే 'మాధ్యమం' అదే. విచక్షణ గల వారికి శాస్త్రీయత పేరిట సవాళ్ల శక్తినీ, వితండవాదులకు జ్యోతిష్యం పేరిట భుక్తిని ఇచ్చేదీ అదే. కొందరు మనసును నెమ్మదింపచేసేది అదే అనుకుంటే, ఇంకొందరు మానసిక పరిస్థితిని గడబిడ చేసేది అదే అని అంటారు. దానిపై మచ్చకో కథ. దాని వెలుగుదో సొద. మొత్తానికి తనది కాని వెలుగుని తనదిగా పంచేసి తనదైన ప్రత్యేకతగా మార్చుకుంది. ఇప్పుడు మరొక కారణంగా ప్రత్యేకతను చాటుకుంది చందమామ. తన సహజ పరిభ్రమణ క్రమంలో భూమికి 'కాస్త' దగ్గరగా వచ్చిన పాపానికి, ఆహ్లాదానికీ, అందమైన అనుభూతులకీ ఆధారమైన ఈ ఉపగ్రహం, భయంకరమైన ఉపద్రవాలకు కారణమైందనీ, మరిన్ని ఉత్పాతాలకు కీలకమౌతుందనీ అనేక అపప్రదలు మూటకట్టుకుంది.

అసత్య ప్రచారాలు

ఇటీవల ప్రత్యేకించి జపాన్‌లో భూకంపం, తత్ఫలితంగా వచ్చిన సునామీ తర్వాత, మార్చి పంతొమ్మిదిన కనిపించే సూపర్‌మూన్ వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని 'అనవసర' ప్రచారం జరుగుతూ వచ్చింది. చుక్క దొరికితే చాలు దాని చుట్టూ బొమ్మని అల్లేయగల నేర్పున్న కొంతమంది 'మీడియాకార్ల' పుకార్లకు మరింత మసాలా దట్టించి మరీ వదిలారు. అవి 'ఆశించిన' ఫలితాన్నే ఇచ్చాయి. వారం పది రోజులపాటు నడిచే నడకనీ, శ్వాస ప్రక్రియనీ కూడా సెన్సేషనల్ చేయగల వార్తాహరులకూ, గ్రహ చలనాలనకీ మానవ మనుగడకీ

కలిపి అర్థాలు చెప్పే మేధావులకూ, సైన్సును విడమర్చి మనకి ఏదో మంచి చెబుదామనుకునే అమాయకులకూ క్షణం తీరిక లేకుండా ఎయిర్ టైం, ప్రింట్ స్పేస్ దొరికాయి. టీవీల్లో ఒకరు చెప్పేది ఒకరు ఖండించుకుంటూ చర్చలు జరిపేశారు. అసలు విషయాన్ని పక్కన పెట్టి ఇక కంప్యూటర్లు అంటే తెలిసిన ప్రతివాడికీ సకల భావ వ్యక్తీకరణస్థలి అయిన అంతర్జాలం నిండా పుంఖానుపుంఖాలుగా సూపర్ మూన్, దాని ప్రభావంపై రాతలు నిండిపోయాయి.



యాదృచ్ఛికమే

గ్రహచలనం మనకి వింతే కావచ్చు కానీ ప్రకృతిలో ఖగోళంలో అది అతిసాధారణం. నిరంతరం జరిగే కార్యక్రమం. అంతేకాదు సూపర్‌మూన్ వల్ల ఊహించిన ప్రమాదాలు కూడా భూగోళంపై, భూగర్భంలో నిత్యం జరిగేవే. పున్నమినాడు చంద్రుడు భూమికి కాస్త దగ్గరగా వస్తేనే సముద్రంలో అలలు కాస్త ఎక్కువ లేస్తాయి. అటువంటిది చంద్రుడు ఇంకాస్త దగ్గరికి వస్తే, తార్కికంగా దాని ప్రభావం మరికాస్త ఎక్కువ ఉంటుంది. అంతేగానీ సునామీలను కలిగించే అంతగానీ, పెను తుఫానులను రేపేంతగానీ ఉండదు. ఇక భూకంపాలను సృష్టించేంత మాత్రం కచ్చితంగా కాదు. ఇంతవరకు ఉటంకిస్తున్న ఉదాహరణలు అన్నీ సూపర్‌మూన్ సంఘటనకు దరిదాపుల్లో వచ్చినవి కావడం యాదృచ్ఛికం. పైగా అటువంటి విపత్తులు కొన్ని ప్రదేశాలకు మాత్రమే పరిమితం కావడం కూడా మూన్‌కీ వాటికీ సంబంధంలేదని తెలియజేస్తున్నాయి. భూగర్భంలో అనంత అంతర్గతశక్తి నిబిడీకృతమై ఉంది. ఉపగ్రహాలు వెలువర్చే ప్రభావం భూమి సహజ శక్తిని మించిపోయే అవకాశం లేదు. ముఖ్యంగా చంద్రుడు తన శక్తితో తన వైపు ఉన్న సముద్ర మట్టాన్ని అమాంతం లాగేసుకుని విపరీతమైన స్థాయిలో సునామీ అలలకు కారణం కాజాలదు.

అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు మనకి అటుపక్క కూడా ఒక జ్యోతిష్య దిట్ట రిచర్డ్ నోల్లి ఉన్నాడు. అతను పని గట్టుకుని సూపర్‌మూన్లకూ భూవిలయాలకు ముడి పెట్టే ప్రయత్నం చేశాడు. ఆ విషయాలని పుస్తకాలుగానూ అచ్చేసి వదిలేశాడు. అతని నోటే సుబ్బరంగా ఉన్న చంద్రునికి సూపర్ మూన్ అని నామకరణం జరిగింది.

అయితే అతనూ, అతని వంటి ఇతర ఆలోచనాకర్తలూ అనుకున్నట్లు మొన్న మార్చి పదకొండో తేదీన వచ్చిన జపాన్ భూకంపం సూపర్‌మూన్ వల్ల వచ్చింది కాదు. ఆ రోజు చంద్రుడు అతి మామూలుగానే ఉన్నాడు. పైగా విధ్వంస సూత్రకారుల ప్రకారం ఆనాటి చంద్రుని ప్రభావం భూమిపై అతి తక్కువగా ఉండాలి.

సూపర్ మూన్ గతంలో 1955, 1974, 1992, 2005లో వచ్చిందని అంటున్నారు. వాస్తవానికి అంతకంటే ఎక్కువ సార్లే చంద్రుడు భూమికి చేరువగా చేరింది. ఒక లెక్క ప్రకారం 413 రోజుల కొకసారి (అంటే ఒక ఏడాది ఒక నెల పద్దెనిమిది రోజులు) భూమికి దగ్గరౌతుంది. అయితే చంద్రుని పూర్ణదశ భూమికి ఎంత దగ్గరగా ఉందన్న విషయంలో లెక్కలు మారతాయి. మార్చి పంతొమ్మిదిన, మొన్నటి సూపర్‌మూన్ పూర్ణచంద్రుడుగా మారడానికీ, భూమికి అతిదగ్గరగా రావడానికీ సుమారు గంట తేడా ఉంది. జులై 21,2005 నాడు ఆ తేడా సుమారు తొమ్మిది గంటలు.



సాధారణంగా పౌర్ణమి అంటే భూమికి ఒక వైపు చంద్రుడు, చంద్రుడికి సరిగ్గా వ్యతిరేక దిశలో, భూమికి మరో వైపు సూర్యుడు ఉంటాయి. అంటే సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే వరుసలో ఉంటాయి. మార్చి పదకొండున చంద్రుడు భూమికి దగ్గరగానూ లేదు, సూర్యుడు, భూమితో ఒకే వరుసలోనూ లేదు. కాబట్టి సూపర్‌మూన్‌కి ఆపాదించిన ప్రభావం వల్ల మొన్నటి జపాన్ భూకంపం కానీ ఆ తరువాతి సునామీ కానీ రాలేదు. పరిభ్రమణంలో చంద్రుడు భూమికి 36,43,397 కిలోమీటర్లు సగటు దూరంలో వస్తుంది. ఇది ఎప్పుడూ జరిగేదే. మొన్నటి సూపర్ మూన్ 3,56, 577 కిలోమీటర్లు దూరంలో ఉండింది. అంటే 7820కిలో మీటర్లు మాత్రమే దగ్గరికి వచ్చింది. భూమ్మీద ఉన్న మనకి అది వింత కావచ్చు కానీ ఖగోళంలో ఆ దూరం అసలు ప్రత్యేకమైనదే కాదు.

గత సూపర్‌మూన్ సమయంలో (సూపర్‌మూన్ అనే మాట 1979 తర్వాతే ప్రాచుర్యంలోకి వచ్చింది) వచ్చాయని చెబుతున్న ప్రకృతి విలయాలు ఆయా పౌర్ణములకు కొన్ని వారాలు/నెలలూ అటూ ఇటుగా వచ్చాయి. కాబట్టి అవన్నీ సూపర్‌మూన్ వల్ల కలిగాయనడానికి లేదు.

మార్చి పంతొమ్మిదిన సూపర్‌మూన్ వచ్చింది. వెళ్లింది. ఎటువంటి అనర్థమూ జరగలేదు.... సాధారణంగా, సహజంగా జరిగే సముద్రపు ఆటుపోట్లకు మించి. అసలు ఎంతమంది నిజంగా సూపర్‌మూన్‌ని కళ్లారా చూశారో అనుమానమే. ఎందుకంటే చంద్రుడి పూర్ణవైభవం ఉదయించే సమయంలోనే కనిపిస్తుంది. ఆకాశంలోకి పైకి వెళ్తున్న కొద్దీ క్రమంగా అది మామూలు పున్నమి చంద్రునిలాగే కనిపిస్తుంది. బహుశా చాలామంది సాయంకాలం ఆరున్నర దాటిన తర్వాతే చంద్రుడిని చూసి ఉంటారు. (ఇంకానయం, సూపర్‌మూన్‌ని చూస్తే పరమ ప్రమాదమని ఎవరూ బోధించలేదు!! లేక బోధించారా?) వారు సూపర్‌మూన్‌లోని సూపర్‌తనాన్ని చూడనట్టే! ఫరవాలేదు. నవంబర్ 14, 2016న మళ్లీ పౌర్ణమి నాడు చంద్రుడు భూమికి ఇంత దగ్గరగా వస్తాడు. ఆ కారణంగా భూమిపై విపరీతాలు మాత్రం జరగవులెండి. ★

సశేషం

ఉలికిపాటు, తొట్రుపాటు, అదిరిపాటు
పాటు ఏదైనా పడకుండా లేచాను
తడిమి చూశాను
క్షణం ముందు వేలాడిన నిమ్మదండలు
విసిరిన వేపమండలు
పచ్చటి ముఖంపై దిద్దిన ఎర్రటి తిలకం
ఏవీ లేవు...
నిద్రలోనే జారుకున్నాయే!
దేవుడ్ని చేసి మాయమయ్యాయే!!
అమరుడ్ని... అధముడ్ని లేపాయే!!!
జిగజిగ ధగధగల తోలు వలచి
వీధిలోకి వచ్చాను
రాత్రి చీకటిలో కాదు
పగటి ఒడిలో, మనుషుల జడిలో
ఎందుకు? అందరూ అలా దూరంగా
దూరం... దూరం... దూరంగా జరుగుతారు
క్రూరమృగాణ్ణో, విషసర్పాన్నో, మద పిచ్చోడ్నో
చూసినట్లు, జడిసినట్లు
సిగ్గుతో యేహ్యంగా, అసహ్యంగా మరలిపోతున్నారు



జీవలోకపు తొలి అడుగు ఇదేగా?
కుల - కుష్టి, మతం - ముష్టి
తెలుపు, ఎరుపు, నలుపుల దృష్టి
లేని అనాగరికత
ఎముకల కొట్టం తెర తీశాను
చీము, నెత్తురు విసర్జించాను
పురుడు పోసి, విరహంలో తేల్చి
రమించి సుఖించిందెవరు?
ఆకలి, కోరిక, కామంతో
ఆవహించి, ఆస్వాదించి, అనుసరించిందెవరు?
శిఖరపు అంచులు శోధించి
పాతాళ లోతుల శుష్కించి
తొలిపుంజ - మలి సంజ
తొలకరి చినుకు - సంద్రపు కౌగిలి
హిమసెగల్లో అగ్నితునకల్లో
ధ్వనించి, శ్రమించి నిల్చున్నాను
ఎవరు నేను? ఏం చేశాను?? ఏమిటి సాధించాను???
రాదు - కాదు - లేదు ల నడుమ
శృతిలేని గీతంలా
పవనంలో పరుగులు పెట్టి
అల ఎరుగని మడుగులా
ఒక్కడ్నే... ఒక్కడ్నే
నిశ్వాసించి
శ్మశాన వైరాగ్యంతో నేను
నేను - నాకు నేను
నువ్వూ నేను నీకు నాకు
ఏముంది?
ఎక్కడుంది?
ఎప్పటి వరకు, ఎంత వరకు?

- బండికట్ల రవికుమార్

కవిత్వమ్

ఉబలాటం

ఎప్పటినుండో
ఏదో రాయాలని ఆరాటం
అదేదై ఉండాలనేది ఊహకందనిది
అతీతమైనదిగా, అద్వితీయమైనదిగా
అందరి మన్ననలు పొందేదిగా, ఆకర్షించేలా
హర్షించేలా, ఆనంద భరితంగా ఉండాలనేదే
నా తాపత్రయం

గతించిన బంగారు బాల్యస్మృతులా
ఉరకలెత్తించిన యవ్వన ప్రాయమా
వార్ధక్య సమస్యల వలయాలా మరి దేని గూర్చి?

రోజూ ఆకసంలో మినుకు మినుకుమనే
చుక్కలా మసకేసిన మబ్బులా



నయాగరా జలపాతాలా, పిచ్చుకల కిలకిల రావాలా
ప్రకృతి వైపరీత్యాలా, మా ఊరి ప్రజల నిట్టూర్పు
గాథలను విడమరచి చెప్పాలనా మరి దేని గూర్చి?? ఆ రాయడం
అంతులేని, పొంతనలేని, అనంతమైన, ఆవేదనా భరితమైన
నా ఉబలాటం!
దివారాత్రాలు నాకదే ఆలోచన, ఆవేదన, ఆవేశం
ఈ రోజుల్లో ఇప్పటికీ అర్థాకలితో అలమటిస్తున్న
అల్లాడుతున్న అశేష అమాయక బీదజనుల దీనావస్థను గూర్చి
రాయాలనే నా సంకల్పం
నిగ్రాని లేని నేటి సమాజంలో నిలువు దోపిడీదారులు
నిస్సహాయులపై నిర్దయగా దినదినం చలాయిస్తున్న దగా, మోసం
వంచన సమూలంగా నిర్మూలించబడాలని ఆ అభిలాష, ఉబలాటం
అంతేగాక అనవరతమూ అనుక్షణం ప్రకృతిలో జరిగే ప్రతీ
పరిణామాల్ని ప్రస్తావించాలని నా ఉల్లాసం, ఉత్సుకత, ఉబలాటం

- ఆర్. భూపాల్‌రెడ్డి

వ్యవసాయం

భూదేవి వరం
ధరిత్రి గర్భం
నిలయం
మహర్షుల
యజ్ఞఫలం
వ్యవసాయం
కరువుకు
కాపాడే వరం
భూసాయం
ఆకలికి ఫలసాయం
వ్యవసాయం
మానవతకు యోగ్యం
ఫలసాయం
ఆర్థికం అందించే
ఫలసాయం
వ్యయసాయం
హలం పొలం
జలం నిలయం
వ్యవసాయం
సంతానం
సంరక్షణం
వ్యవసాయం
సుఖశాంతులకు
ఆలవాలం
వ్యవసాయం

- సీరపు మల్లీశ్వరరావు



నవ్వుల్ - పువ్వుల్

హాయిగా వెళ్లాలని!

టికెట్ కలెక్టర్ : ఎక్స్‌ప్రెస్ రైలు టిక్కెట్టు తీసుకుని పాసింజర్‌లో ప్రయాణం చేస్తున్నారేమిటి?

ప్రయాణికుడు : ఎక్స్‌ప్రెస్‌లో కొంతదూరం ప్రయాణం చేశాను. సీటు దొరక్క లావెట్రీలోనే నిలబడి ప్రయాణం చేశాను. ఇప్పుడైనా హాయిగా పడుకుని వెళ్లొచ్చని ఈ పాసింజర్ ఎక్కాను సార్.

బిచ్చగాడి సలహా

బిచ్చగాడు : అమ్మగారూ! ఈ రోజు చాలా ఆకలిగా ఉందండి. తొందరగా ఏమైనా తినడానికి పెట్టండమ్మా.

గృహిణి : నా రెండు చేతులు ఖాళీగా లేవు. గోరింటాకు పెట్టుకున్నాను.

బిచ్చగాడు : అయ్యో ఈ సారి ఒక చేతికి ఒకరోజు, రెండో చేతికి మరొక రోజు గోరింటాకు పెట్టుకోండమ్మా!

బావున్నాయంటేనూ...

భర్త : ఏమేవ్! నా దువ్వెన ఏది? కనిపించడం లేదు.

భార్య : చాలా బావుందని నిన్న ఊర్నుండి వచ్చిన మా తమ్ముడు పట్టుకెళ్లాడండి.

భర్త : మరి నా చెప్పులు ఏవి?



భార్య : అయ్యగారి చెప్పులు బావున్నాయండి అని ముష్టివాడు అన్నాడు. అందుకే వాడికి ఇచ్చేశాను.

మతిమరుపు

పేషెంట్ : (సంతోషంగా క్లినిక్ నుండి వెళ్తూ) నా మతిమరుపు జబ్బు తగ్గడానికి మంచి మందులు రాసి ఇచ్చినందుకు థాంక్యూ డాక్టర్.

డాక్టర్ : ఆగుబాబు! నువ్వు నా పెన్ను, పుస్తకం నీ బనియన్ లోపల వేసుకున్నావ్. ముందు వాటిని బయటికి తీసి ఇవ్వు. అలాగే ఫీజు కూడా ఇవ్వు.

జె. సుధాకర్ పట్నాయక్,

కాకినాడ.

ఉంగరం

రాజీవ్: మా ఆవిడతో గ్లోవ్స్ కొనే అలవాటు మాన్పించడం ఎలా?

సందీప్: సింపుల్! ఆమెకు ఓ డైమండ్ ఉంగరం కొనివ్వు.

ఫూల్

భార్య: చూడు! నేను ఫూల్‌ని కాకపోతే నిన్ను పెళ్లిచేసుకునే దాన్నే కాదు.

భర్త: అవును. నేను కూడా ఆ విషయాన్ని ప్రేమ మైకంలో వుండి గమనించలేదు.

మమ్మీ

బన్నీ: నాన్నా! నువ్వు ఎప్పుడైనా ఈజిప్టు వెళ్లావా?

తండ్రి: ఏం ఎందుకలా అడిగావ్‌రా ?

బన్నీ: మరి నీకు ఈ మమ్మీ ఎక్కడ దొరికింది.

కనుగొన్నది...

టీచర్: రామూ! అమెరికా ఎక్కడుందో చూపించు?

రాము: (మ్యాప్ దగ్గరకెళ్లి చూపిస్తూ) ఇక్కడ వుంది మేడమ్.

టీచర్: ఒరే కేశవ్! అమెరికాను ఎవరు కనుగొన్నారో చెప్పు?

కేశవ్: రాము టీచర్.

అబద్ధం

సేల్స్‌మేన్ అబద్ధం చెప్తున్నాడని ఎలా చెప్పగలవు?

అతని పెదవులు కదలడాన్ని బట్టి.

ప్రధానం

టీచర్: సూర్యుడు, చంద్రుడులో ఎవరు ముఖ్యం?

పాప: చంద్రుడు.

టీచర్: ఏం ఎందుకని?

పాప: చంద్రుడు రాత్రి వేళల్లో మనకు అవసరమైనప్పుడు వెలుగునిస్తాడు. అదే సూర్యుడైతే మనకు అవసరం లేని పగటిపూట వెలుతురునిస్తాడు. అందుకని.

- హరి, ఒంగోలు.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

మనసుందా?! మార్గమూ ఉంది!

కోట్ల కొద్దీ బడ్జెట్‌తో రెండేళ్ళు కష్టపడి సినిమాలు తీస్తుంటే, రెండు వారాలు కూడా ఆడడం లేదన్నది సినీ రంగంలో ఎదురు దెబ్బలు తిన్న ఏ పెద్ద దర్శక, నిర్మాతను కదిలించినా అనే మాట. అసలు సినిమాను అన్నేసి రోజులు తీయాల్సిన అవసరం ఉందా? అన్నన్ని కోట్లు పెడితే కానీ సినిమా తీయలేమా? ఇలాంటి ప్రశ్నలకు జవాబుగానా అన్నట్లు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తాజాగా అందించిన చిత్రం - 'దొంగల ముఠా'. శ్రేయా ప్రొడక్షన్స్ - రామ్‌గోపాల్ వర్మ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఓ సరికొత్త అధ్యాయానికి నాంది పలికింది. అసలు సినిమా తీయాలంటే ఎంత డబ్బు, ఎన్ని రోజులు కావాలన్న అంశంపై చర్చను లేవనెత్తింది.

- రెంటాల జూనియర్

చిత్రంలోని నటీనటుల మీద కానీ, సాంకేతిక నిపుణుల మీద కానీ పైసా కూడా ఖర్చు పెట్టకుండా రామ్ గోపాల్ వర్మ ఈ చిత్రాన్ని కేవలం అయిదంటే అయిదు రోజుల్లో రూపొందించారు. యూనిట్‌లో ఎవరికీ రూపాయి కూడా చెల్లించకుండానే ఆయన ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. రేపు పొద్దున్న ప్రేక్షకాదరణ ద్వారా సినిమాకు లాభాలు వచ్చినప్పుడు, యూనిట్ సభ్యుల మార్కెట్ విలువ ప్రకారం పారితోషికాలు నిర్ణయించి చెల్లిస్తామని చిత్ర నిర్మాణానికి ముందే ప్రకటించారు. "పరిమిత బడ్జెట్‌లో, తక్కువ రోజుల్లో నాణ్యమైన సినిమాలు అందించవచ్చని నిరూపించడానికే ఈ ప్రయత్నమంతా!" అని రామ్ గోపాల్ వర్మ అన్నారు. నేరుగా డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తే, చిత్ర నిర్మాణం ఎంత లాభసాటిగా ఉంటుందో ఈ 'దొంగల ముఠా' ద్వారా నిరూపించాలని రామ్ గోపాల్ వర్మ ప్రయత్నించారు.

తక్కువ రోజుల్లో తెలుగు సినిమా తీయగలమా?

శూన్య బడ్జెట్‌తో 5 రోజుల పరిమిత షెడ్యూల్‌లో రామ్ గోపాల్ వర్మ సృష్టించిన 'దొంగల ముఠా' తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ప్రకంపనలు సృష్టించింది. తెలుగు చిత్రసీమలోని ప్రముఖులైన రవితేజ, ఛార్మి లక్ష్మీ మంచు, ప్రకాశ్‌రాజ్, బ్రహ్మానందం లాంటివాళ్ళను పెట్టుకొన్నప్పటికీ, రూపాయి కూడా ఖర్చు లేకుండా సినిమా తీయాలన్న రామ్ గోపాల్ వర్మ విచిత్రమైన ఆలోచనా పంథా అందరినీ ఒక్క కుదుపు కదిపింది. మంచి సినిమాలు తీయడం మానేసి, ఏదో ఒకటి తీసి, వాటిని 'మార్కెటింగ్' చేసే పనిలో పడ్డాడనే అపప్రధనూ కలిగించింది.


'పెళ్ళంటే ఇదేరా!' లో... ప్రభుదేవా, రోజా

నిజానికి, ఇలా తక్కువ షూటింగ్ రోజుల్లో సినిమాను పూర్తి చేయడమనే విధానం గతంలో కూడా కొన్ని చిత్రాలకు అనుసరించినదే. సన్నిహితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం ఎన్టీఆర్ తన రాజకీయ రంగప్రవేశానికి ముందు నటించిన ఆఖరి చిత్రం 'నా దేశం' షూటింగ్ మొత్తం కేవలం 19 రోజుల్లో పూర్తి అయింది. అంత పెద్ద హీరోతో, ఓ వాణిజ్య చిత్రం అంత తక్కువ రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసుకోవడం అప్పటికీ, ఇప్పటికీ ఓ సంచలనమే. కళాత్మక చిత్రాలో, వెండితెరపై ప్రయోగాలో ఇలా తక్కువ సమయంలో పూర్తి చేసుకోవడం సాధ్యమే. కానీ, పెద్ద తారలతో పూర్తి స్థాయి వాణిజ్య చిత్రం తీయడం మాత్రం చాలా కష్టసాధ్యం.

వివిధ భాషల్లో... తక్కువ రోజుల్లో...

అయితే, తెలుగు మాటెలా ఉన్నా, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో మాత్రం ఇలా తక్కువ రోజుల్లో సినిమా చిత్రీకరణ ప్రయోగాలు గతంలో ఒకటికి రెండు సార్లు జరిగినదే. ఒకే రోజులో షూటింగ్ పూర్తి చేసుకున్న రికార్డు చిత్రాలూ ఆ యా భాషల్లో వచ్చాయి. కన్నడ చిత్రసీమలో స్థిరపడ్డ మలయాళ కెమేరామన్ దినేష్ బాబు గతంలో ఇలాంటి సినిమా ప్రయోగం చేశారు. 1988లోనే ఆయన ఎనిమిది మంది నటీనటులతో, కేవలం రూ. 15 లక్షల వ్యయంతో 'ఇదు సాధ్య' అంటూ కన్నడంలో ఓ థ్రిల్లర్ చిత్రం రూపొందించారు. ఓ రంగస్థల ప్రదర్శన శాల నేపథ్యంలో ఈ చిత్రం నడుస్తుంది. ఒకే లొకేషన్‌లో 48 గంటల్లో పూర్తయిన ఈ చిత్రం అప్పట్లో అత్యంత వేగంగా పూర్తయిన భారతీయ చిత్రంగా 'గిన్నిస్ రికార్డుల'లోకి ఎక్కింది.

ఇక, 1999లోనే తమిళంలో 'స్వయంవరం' పేరిట ఓ చిత్రం తయారైంది. ప్రపంచ రికార్డు సృష్టించిన ఈ చిత్రాన్ని పరుచూరి బ్రదర్స్ సోదరుడైన పి.ఆర్. కుటుంబరావు అలియాస్ చిన్ని తెలుగులో 'పెళ్ళంటే ఇదేరా!' పేరిట అనువదించారు. దాదాపు పదిమంది పెద్ద హీరోలు, అంతే సంఖ్యలో హీరోయిన్లు ఉన్న ఈ చిత్రాన్ని మొత్తం 14 మంది దర్శకులు రూపొందించారు. అంత మంది దర్శకులు పని చేయడం, ఏక కాలంలో వేర్వేరు లొకేషన్లలో వేర్వేరు యూనిట్లు పని చేయడం ద్వారా ఒకే రోజులో షూటింగ్ మొత్తం పూర్తి అయింది. అంతమంది చేతుల్లో నుంచి వచ్చినప్పటికీ ఎక్కడా ఒడుదొడుకులు లేకుండా చిత్ర కథాకథనం సాఫీగా సాగిపోవడం విశేషం. ఈ సినిమాలో అయిదు పాటలుండడం విశేషమైతే, అయిదుగురు వేర్వేరు దర్శకులు (ఇళయరాజా, దేవా, విద్యాసాగర్, సిర్పి, ఎస్.ఏ. రాజ్‌కుమార్) స్వరకల్పన చేయడం విశేషం. గాయకుడు - సంగీత దర్శకుడైన జి. ఆనంద్ ఈ తెలుగు రూపానికి సంగీతం అందించారు. అయితే, ముందుగా తమిళంలో రూపొందిన ఈ 24 గంటల తయారీ సినిమా అటు ఆ భాషలో కానీ, ఆ తరువాత తెలుగులో కానీ ఆసక్తిని రేపడమే తప్ప, అసలైన విజయాన్ని అందుకోలేకపోయింది.

జాతీయ అవార్డు గెలుచుకున్న మలయాళ చిత్రదర్శకుడు జయరాజ్ సైతం తానే దర్శక - నిర్మాతగా 2005 డిసెంబర్ 19వ తేదీన అతి తక్కువ సమయంలో సినిమా మొత్తం తీశారు. కేవలం 2 గంటల 14 నిమిషాల వ్యవధిలో 'అద్భుతం' అనే మలయాళ, ఆంగ్ల ద్విభాషా చిత్రాన్ని హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరించారు. ప్రముఖ మలయాళ నటుడు సురేష్ గోపి నటించిన ఈ చిత్రం 'యుథనేసియా' (కారుణ్య మరణం) అంశం చుట్టూ తిరుగుతుంది. కనీసం 72 నిమిషాల వ్యవధి ఉంటే కానీ, ఫీచర్ ఫిల్మ్ విభాగం కింద పరిగణనలోకి తీసుకోరు గనక, ఈ చిత్రాన్ని 78 నిమిషాల వ్యవధి ఉండేలా తీశారు. అతి కొద్ది సమయంలోనే షూటింగ్ అంతా పూర్తి చేయడం కోసం అయిదు రోజుల పాటు రిహార్సల్స్ కూడా జరిపారు.

రెండేళ్ళ క్రితం 2009లో తమిళంలో 'శివప్పు మళై' (అరుణ వర్షం) అనే మరో తమిళ

చిత్రం కేవలం 12 రోజుల్లో మొత్తం రూపకల్పన, చిత్రీకరణ పూర్తి చేసుకొని 'గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల'లోకి ఎక్కింది. స్క్రిప్టు రచన దగ్గర నుంచి సినిమా తుది రూపం వరకు అంతా 2009 మే 22 నుంచి జూన్ 3 మధ్య పూర్తయింది. ఈ చిత్రంలో 12 మంది ముఖ్య పాత్రధారులు, 600 మందికి పైగా సాంకేతిక నిపుణులు పనిచేశారు. సురేశ్ జోయకిమ్ (కెనడాకు చెందిన నటుడు, నిర్మాత, పలు గిన్నిస్ రికార్డుల సాధకుడైన ఈయన ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరు. చిత్ర హీరో కూడా!), మీరా జాస్మిన్, వివేక్, బోస్ వెంకట్‌తో పాటు తెలుగు నటుడు సుమన్ సైతం ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించారు. దర్శకుడిగా వి. కృష్ణమూర్తికి తొలి చిత్రమైన ఈ సినిమా అతి తక్కువ కాలంలో మొత్తం పూర్తి చేసుకుందనే ఘనత సాధించింది.

'శివప్పు మళై' (అరుణ వర్షం) లో... మీరా జాస్మిన్

దీనికి ముందు కేవలం 13 రోజుల్లో రచన మొదలు చిత్రీకరణ దాకా మొత్తం పూర్తయిన రికార్డు చిత్రం – 1990లో తయారైన బ్రిటీషు సినిమా 'ది ఫాస్టెస్ట్ ఫార్వర్డ్' (దర్శకత్వం రూస్ మాల్కిన్, జాన్ గోరె). శ్రీలంక తమిళ ప్రజల సమస్యలను నేపథ్యంగా తీసుకొని, 2 గంటల నిడివిలో తయారైన తమిళ చిత్రం 'శివప్పు మళై' 2010 ఏప్రిల్ 9న తమిళనాట విడుదలైంది. అయితే, ఈ చిత్రానికి మూడు కెమేరా యూనిట్లు వాడారు. చిత్రం బడ్జెట్ సైతం దాదాపు రూ. 2.25 కోట్లు.

వర్మ 'దొంగల ముఠా' గొప్పేంటట?

వివిధ భారతీయ భాషల్లో తయారైన ఆ చిత్రాలతో పోలిస్తే, రామ్ గోపాల్ వర్మ తెలుగు 'దొంగల ముఠా' పరిస్థితి వేరు. ఈ సినిమాకు వర్మ ఒక్కరే దర్శకుడు. సినిమా చిత్రీకరణకు పనిచేసిన సాంకేతిక నిపుణులు ఆయనతో సహ మొత్తం 8 మందే! ఇక, సినిమాలోని మొత్తం పాత్రలు, తెరపై కనిపించే నటీనటుల సంఖ్య తొమ్మిది. కేవలం రూ. 6.5 లక్షల వ్యయంతో సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఇక, ఈ ప్రయోగాత్మక సినిమాకు కెమేరామన్ అంటూ ప్రత్యేకించి ఎవరూ లేరు. దీని చిత్రీకరణ కోసం వాడినవల్లా సినిమాలు తీసే కెమేరాలు కాదు, ఫోటోలు తీసే 'క్యానన్ 5డి' కెమేరాలు మాత్రమే. ఫోటోలు తీసే మామూలు డిజిటల్ కెమేరాలతో ఇలా పూర్తిస్థాయి వాణిజ్య పంథా చిత్రానికి రూపకల్పన చేయడం, ఆ చిత్రాన్ని వెంటనే విడుదల కూడా చేసెయ్యడం భారతదేశంలో ఇదే తొలిసారి అని సినీ వర్గీయుల కథనం.

విడుదలై వారం పది రోజులు దాటిన 'దొంగల ముఠా' చిత్రం ఓ సినిమాగా ఏమంత బాగా లేదన్నది అధిక శాతం మంది ఒప్పుకుంటున్న, చెప్పుకుంటున్న నిజం. అయితే, ఈ సినిమాకు అనేక ప్రత్యేకతలున్నాయి. "అయిదు రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసి, కొత్త అధ్యాయానికి తెర తీశాం. షూటింగ్ జరిపిన ఆ 5 రోజులు కూడా మేము చిత్రీకరణ జరిపింది – సాధారణ పని గంటల్లోనే! పైగా ఈ చిత్రం కోసం సహజమైన లైటింగ్‌ను వాడాం" అని రామ్ గోపాల్‌వర్మ స్వయంగా చెప్పారు.

రికార్డుల కోసం ఒక్క రోజులో సినిమాలు తీసినవాళ్ళకూ, రామ్ గోపాల్ వర్మకూ ఓ ప్రధానమైన తేడా ఉంది. "వాళ్ళందరూ అయిదారు యూనిట్లతో షూటింగ్ జరుపుతూ, ఒక్క రోజులో చిత్రీకరణ పూర్తి చేశారు. కానీ, వర్మ ఒకే యూనిట్‌తో సినిమా రూపొందించాడు. అంతటి ధైర్యం ఉన్న వర్మ తనకు తానే సాటి" అని తెలుగు సినీ రంగంలో దర్శకుడైన వరప్రసాద్ వ్యాఖ్యానించారు. కానీ, ప్రయోగాత్మకంగా కేవలం రూ. 6.5 లక్షల వ్యయంతో సినిమా రూపొందించిన వర్మను మెచ్చుకొంటున్న వారు వాణిజ్య వర్గాల్లో మాత్రం కరవే. హిందీలో అవకాశాలు తగ్గిన వర్మ ఇక్కడకు మళ్ళీ వచ్చి, ఏదో ఒక పబ్లిసిటీ జిమ్మిక్కుతో నాలుగు రాళ్ళు వెనకేసుకొని, పాత నష్టాల నుంచి

'అద్భుతం' లో సురేష్ గోపీ, మమతా మోహన్‌దాస్

బయటపడాలని ప్రయత్నిస్తున్నారని కొందరి విమర్శ.

ప్రయోగాల వర్మ

"ఇవాళ చాలామంది కోటిన్నర బడ్జెట్ అంటూ సినిమా మొదలుపెట్టించి, రూ. 10 కోట్లు ఖర్చు పెట్టిస్తున్నారు. కానీ, వర్మ అలా చేయలేదే! అయినా, మనవాళ్ళకు పొరుగింటి పుల్లకూర రుచి. 'పేరా నార్మల్ యాక్టివిటీ' పేరిట విదేశీయులు ఓ నాసిరకం సినిమాను తీసినా, ఆ తక్కువ బడ్జెట్ చిత్రం సాధించిన భారీ వసూళ్ళ గురించి, గొప్పగా చెప్పుకుంటాం కానీ, మన మధ్యలో తిరిగే మనవాడు ఏదైనా సాధిస్తే మెచ్చుకోం" అని వరప్రసాద్ ఘాటుగా విమర్శించారు. నిజానికి, ప్రయోగాలు రామ్ గోపాల్ వర్మకు కొత్త కాదు. ముగ్గురే ప్రధాన పాత్రధారులుగా ఆయన హిందీలో 'కౌన్?' చిత్రం రూపొందించారు. అలాగే, నటుడు 'జె.డి.' చక్రవర్తికి దర్శకత్వ బాధ్యతలు అప్పగించి, దాదాపుగా ఒకే గదిలో సాగే ఓ తెలుగు సినిమాను టైటిలంటూ లేకుండా వర్మే నిర్మించారు. అలాగే, తన దగ్గర ఆఫీసులో చిల్లర పనులు చేసే సహాయకుడిగా మొదలైన ఇ. నివాస్ అనే తెలుగు కుర్రాణ్ణి 'శూల్' చిత్రం ద్వారా దర్శకుణ్ణి చేశారు. "సినీజీవిత నిత్య సూత్రాలకు భిన్నంగా ఇలా వర్మ చూపే తెగువను ప్రశంసించాల్సిందే" అన్నది వరప్రసాద్ లాంటి వారి వాదన.

ఉత్సాహం పెంచే వినూత్న ప్రయత్నం

'దొంగల ముఠా' కథలో పస ఉందా, లేదా, రమారమి రెండు గంటల పాటు దాన్ని ఏ మేరకు ఆసక్తికరంగా చూపారన్నది చర్చనీయాంశమే. కానీ, ఈ ఇంగ్లీషు చిత్రాల ప్రభావం కనిపించే ఈ "వినోదాత్మక థ్రిల్లర్" సినిమా చిత్రీకరణకు స్టిల్ కెమేరాలను ఉపయోగించిన విధానం, సంప్రదాయానికి భిన్నమైన కెమేరా కోణాల వినియోగం, నేపథ్య సంగీతం ద్వారా ప్రేక్షకులలో ఉత్కంఠను పెంచే ప్రయత్నం వగైరా వైవిధ్యభరితమైన చిత్రీకరణ శైలి అన్నవి గుర్తించాలి. "భారతదేశంలో 'క్యానన్ 5డి' స్టిల్ కెమేరా వినియోగంతో తయారైన తొలి చిత్రం ఇదే" అని సినీ వర్గాలు చెప్పాయి. హైదరాబాద్ నడిబొడ్డున బంజారా హిల్స్‌లో టీవీ సీరియల్సే తప్ప, సినిమా తీయడానికి ఎవరూ పెద్దగా సాహసించని 'రాక్ కాజిల్' అనే సామాన్యమైన లొకేషన్‌లో ఆయన ఈ 'దొంగల ముఠా' మొత్తాన్నీ చిత్రీకరించారు. ఆ రకంగా నవీన పథ నిర్దేశం చేసిన దర్శకుడిగా వర్మను ప్రశంసించాల్సిందే. పైగా, అతి తక్కువ ఖర్చులో తీసిన సినిమా గనక, ఉపగ్రహ టీవీ చానల్ ప్రసార హక్కులతో సహ ఓ మాదిరి వసూళ్ళను కలుపుకొన్నా వాణిజ్యపరంగా సినిమా విజయం సాధించినట్లే లెక్క.

అయితే, "ఏ సినిమానైనా ఒక్క రోజులో చిత్రీకరణ మొత్తం ముగించడం అసాధ్యమైన కార్యమే. రికార్డు కోసం ఒక్క రోజులో సినిమా చిత్రీకరణను పూర్తి చేయవచ్చేమో కానీ, వాణిజ్యపరంగా లాభదాయకమైన సినిమాను మాత్రం తీయలేం" అని దర్శకుడు వరప్రసాద్ సైతం అభిప్రాయపడ్డారు. కానీ, ప్రతి సినిమాకూ దాదాపు 60 నుంచి 120 రోజుల దాకా షూటింగ్ డేస్, 150 నుంచి 200 దాకా యూనిట్ సభ్యులు అవసరమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో "భారతీయ సినిమా చరిత్రలోకెల్లా అతి తక్కువ వ్యయంతో నిర్మాణమైన చిత్రం"గా చెప్పుకుంటున్న రామ్ గోపాల్ వర్మ 'దొంగల ముఠా' లాంటి వినూత్న ప్రయత్నాలు ఓ కొత్త ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ అందిస్తాయి. మనసుంటే మార్గముందనీ, సినిమా రూపకల్పన మీద అపారమైన ప్రేమాభిమానాలుంటే తక్కువ ఖర్చులోనే తెర మీదకు చిత్రాన్ని తీసుకురావచ్చునీ ధైర్యమిస్తాయి. ఆ మేరకు ఈ ప్రయోగాలు అవసరమే! అభిలషణీయమే!!

★

ఎండల్లో హాయ్... హాయ్...

ప్రకృతి భలే విచిత్రమైనది సుమా! ఓవైపు ఎర్రటి ఎండలతో పొగలు సెగలు కక్కేలా చేస్తుంది. మరోవైపు ఆ వేసవి తాపాన్నుంచి బయటపడడానికి వీలైన పదార్థాలనూ ఇస్తుంది. చల్లచల్లటి పుచ్చకాయలు, తాటి ముంజలు, కొబ్బరి బొండాలు, మామిడి కాయలు, చెరకు రసాలు, నిమ్మ రసాలు ఇచ్చింది. ఇవి దాహాన్ని తీరుస్తాయి. పైగా వీటిలో శరీరానికి ఉపయోగపడే పోషక పదార్థాలు ఎన్నో. విచిత్రం కాక మరేంటి! ఇవికాక మనం కనిపెట్టిన గొడుగులు, కళ్లజోళ్లు, టోపీలు వుండనే వున్నాయి. ఏ ఎండకా గొడుగు పట్టమని పెద్దలు ఏనాడో చెప్పిన మాటను ఫాలో అయిపోతే సరి. ఏమంటారు. మరి ఎండాకాలంలో మనకు అందుబాటులో వుండే పళ్లు కాయలు, రసాల గురించి చెప్పుకుందామా.



పుచ్చకాయ అద్భుతమైన ఆహారం. గ్రీష్మానికి సరైన విరుగుడు పుచ్చపండు. తన ఎర్రటి ఎరుపుతో పిల్లలనూ, పెద్దలనూ ఆకట్టుకుంటుంది. ఇందులో ఎటువంటి కొవ్వు, కొలెస్టరాల్ వుండదు. పుచ్చకాయ మొత్తం బరువులో 92 శాతం నీరుకాగా ఆరుశాతం షుగర్ వుంటుంది. పుచ్చరసం తాగితే కడుపులో చల్లగా హాయిగా వుంటుంది.

వేసవిలో అత్యంత సాధారణంగా కనిపించేవి కొబ్బరి బొండాలు, తాటి ముంజలు, చెరుకు రసాలు. ఇవి కూడా దాహాన్ని తీర్చి ఎండవేడి నుండి సేద తీర్చేవే. సహజమైన ఈ పదార్థాలు నిజంగా ప్రకృతి మానవులకి ఇచ్చిన వరాలే. నల్లతాటి కాయలు లోపల మూడు మంచు గిన్నెలు, వాటిలోని తియ్యని నీళ్ల –వేసవిలో తోడి తింటుంటే సూపర్. ఈ రుచి, అనుభవమే వేరు. వేసవిలో ముంజలు చాలా మంచి చేస్తాయి. వాటిని రోజూ తింటే వేసవిని ఇట్టే తీసేస్తాయి. కానీ ఏం చేస్తాం. అక్కడక్కడా అమ్ముతున్నా పట్టణాల్లో అందరికీ ఇవి అందుబాటులో వుండవు. కొన్ని అద్భుతాలు కొందరికి లభ్యం కావు అని సరిపెట్టోకోవలసిందే.

ఇక సర్వత్రా లభించేవి లేత కొబ్బరి బొండాలు. అప్పటికప్పుడు చెట్టు నుండి దించిన బొండాం నీళ్లు నులివెచ్చగా, కాస్త తీయగా, కాస్త ఉప్పగా మొత్తానికి గొప్పగా వుంటాయి. ఆరోగ్యానికి హానిచేసే 'కూల్' డ్రింకులన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైనది కొబ్బరి బొండాం. ఒక జన్మించే మొక్కకు కావలసిన పోషక పదార్థాలన్నీ అందులో వుంటాయి. కాబట్టి మనకు అవి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ వేసవిలో కొబ్బరి బొండాల్ని వదలకండి. కాకపోతే కాస్తంత ఎక్కువ ఖరీదు కూడా! కాని బొండాలు జ్వరం వచ్చిన వాళ్ళకీ, వడదెబ్బ తగిలిన వాళ్ళకీ, డయేరియా, నీరసం వున్న వాళ్ళకి మాత్రమే కాదు మాములు వాళ్లు అవి తాగితే పైన చెప్పిన అవస్థలు రాకుండా తప్పించుకోవచ్చు! కొబ్బరి నీళ్ళు (లేత కొబ్బరి నీళ్ళు) శరీరానికి చలువ చేయడమే కాక జీర్ణకోశ సంబంధ సమస్యలను తగ్గిస్తాయి. మూత్రనాళ సంబంధ సమస్యలని తీసివేస్తాయి. కొలెస్టరాల్‌ని నియంత్రిస్తాయి. కొబ్బరి నీళ్ల సహజమైన ద్రవం. దానితో తక్కువ చక్కెర పదార్థాలే కాకుండా తక్కువ పిండిపదార్థాలూ వుంటాయి. కొవ్వు కూడా వుండదు.

వేసవిలో ఎక్కడ బడితే అక్కడ చెరుకు రసం బళ్లు దర్శనమిస్తాయి. చెరుకుగడలను పిండి...రసాన్ని వడగట్టి, కాస్త అల్లం, నిమ్మకాయ జోడించి తాగితే మిట్టమధ్యాహ్నపు ఎండలో ఎన్ని గ్లాసుల రసమైనా సర్రున జుర్రెయ్యవచ్చు. చెరుకు రసం నీరసాన్ని తగ్గిస్తుంది, సేద తీరుస్తుంది. దానిలోని అధిక కార్బోహైడ్రేట్ల కారణంగా శక్తినిస్తుంది. సాధారణంగా రసం ద్వారా ఇబ్బంది కలగకపోవచ్చు కానీ, రసం తీసే పద్ధతులు, ఆ పరిసరాల వల్ల కొన్ని సమస్యలు రావచ్చు. రసం తీసేవాళ్ళ... రసం తీసే యంత్రం శుభ్రంగా వుండక పోవచ్చు. గ్లాసులు, ఐసు కూడా! ఐసు వేసుకోకపోవడమే మంచిది. ఇక చెరుకు పిప్పి ఈగల్ని, బ్యాక్టీరియాని ఇట్టే ఆకర్షిస్తుంది. ఇవన్నీ దృష్టిలో వుంచుకుని చెరుకు రాసాన్ని సేవించాలి. అయితే అదే పనిగా అధికంగానూ, రోజూ చెరుకు రసాన్ని తాగడం అంత మంచిది కాదు. కానీ ఎండ

వేడి నుండి సేద తీరాలంటే చెరుకు రసం ఉత్తమం.

వేసవి తనతోపాటు మామిడి పండ్లను వెంట తెస్తుంది. మామిడి పండ్ల రసాన్ని అలా జుర్రుతుంటే అబ్బ! ఆ అనుభూతి తెలియని వారుండరంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. అంత మజా ఏ పండు తినేప్పుడూ రాదేమో! మామిడి పండ్లు వేడి చేస్తాయని కొందరు వాటిని తినడానికి భయపడుతుంటారు. కానీ యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉన్న ఈ పండ్లు ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి. విటమిన్లు, ఖనిజాలూ పుష్కలంగా ఉంటాయి. ఇవి మంచి పోషకాహారం. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఏ పండులోనూ లేనంతగా మామిడి పండులో 'ఇ' విటమిన్ ఉంటుంది. ఒక మామిడి పండులో 3 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఫైబర్ కొలెస్టరాల్‌ను తగ్గించడమే కాకుండా జీర్ణశక్తిని పెంచుతుంది.

ఆకుకూరలు, టమోటాలు, దోసకాయలు కూడా వేసవిలో తినవలసిన పదార్ధాలు. చవగ్గా లభించే ఆకుకూరుల్లో నీరు, పీచుపదార్థమే ఎక్కువగా వుంటుంది. వాటిలో వుండే సహజ లవణాలు వేసవితాపం, దాహం తీరుస్తాయి. టమోటాలు తింటే ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలుగుతుంది. బయటకు వెళ్లబోయేముందు రెండు టమోటాలను తిని వెడితే ఎండను తట్టుకోవచ్చు. బాగా మగ్గిన టమోటాలను రసం తీసుకుని కొంచెం ఉప్పు, పంచదార, నిమ్మరసం కలుపుకొని తాగితే దాహం నుంచి ఉపశమనం కలుగుతంది. వేసవిలో కందిపప్పు కంటే పెసర పప్పు తింటే త్వరగా జీర్ణం అవుతుంది. పెరుగు ఎక్కువగా వాడితే మంచిది. అలాగే వేసవిలో నోటికి ఘాటుగా వుండేవి తినాలనిపిస్తుంది. పచ్చళ్లలో పెరుగును వాడితే నోటికీ రుచిగా వుంటుంది. వంటికీ ఉపయోగకరంగా వుంటుంది. ఈ ఎండల్లో నూనె ఎక్కువగా పీల్చే పదార్థాలను, టిఫెన్లను దూరంగా వుంచాలి. పూరీలు, దోసెలు, పునుగులు వంటివి నూనె కొంచెం ఎక్కువగా పీలుస్తాయి. అందుకే వాటిని తినకుండా వుండడమే బెటర్. ఇడ్లీలు, బ్రెడ్, నూనె లేకుండా చపాతీలు, పుల్కాలు వంటివి తీసుకోవచ్చు. నిమ్మ పులిహార, పెసర పొంగలి తీసుకోవచ్చు.

ఎండల్లో జాగ్రత్తలు

ఎండాకాలమైనా ఉద్యోగాలూ, పనులూ, అవసరాలూ మనల్ని ఎండన పడేస్తాయి. కాబట్టి ఎలాగోలా, అది పుర్తయ్యే వరకూ ఎండ నుండి కాపాడుకోక తప్పని పరిస్థితి వస్తుంది. సాధారణంగా ఎండకి బాగా ప్రభావితమయ్యేది మన కళ్ళే. వేడికి చర్మం ఇబ్బంది పడితే కాంతికి కళ్లు కలవరపడతాయి. అందువల్ల కళ్ళని ప్రత్యేకంగా కాపాడుకోవడం ముఖ్యం. సూర్యకాంతిలోని అల్ట్రావైలెట్ కిరణాలు అటు చర్మాన్ని ఇటు సున్నితమైన రెటీనానీ దెబ్బతీస్తాయి. కాబట్టి ఆ కిరణాల నుండి వాటిని రక్షించుకోవడం తప్పనిసరి. కానీ ఎలా? చర్మానికైతే వస్త్రం తోనో, గొడుగు నీడలోనో, ప్రస్తుతం మార్కెట్లో విరివిగా లభించే అపార క్రీములు, లోషన్ల సంపదతోనో కాస్త రక్షణ పొందవచ్చు. మరి కళ్ళకి కళ్ళజోళ్ళే దిక్కు! కళ్ళద్దాలు (చలువ కళ్లద్దాలు- సన్‌గ్లాసెస్- కూలింగ్ గ్లాసెస్) కూడా ప్రస్తుతం విస్తారంగా కాస్త నాణ్యమైనవీ, నిజంగా కంటికి అవసరమైన రక్షణని కల్పించేవాటిని చాలా ముఖ్యం.

ఎందుకంటే 'మంచి' కళ్లద్దాలు కాకపోతే రక్షణమాట అటుంచి కళ్లు దెబ్బతినే ప్రమాదమే ఎక్కువ.

- ◆ వేసవిలో సూర్యరశ్మిలోని అల్ట్రా వయొలెట్ కిరణాలవల్ల చర్మం. కమిలిపోతుంది. దీన్ని 'టానింగ్' అంటారు. దీని నుంచి తప్పించుకునేందుకు. స్ట్రాబెర్రీ పళ్ళ గుజ్జు ఖీరాల ముద్ద చక్కగా పని చేస్తాయి.
- ◆ చర్మం కమిలిన చోట టొమాటోల పలుచని చక్రాలను తేలికగా రుద్దాలి. 20-25 నిముషాల తరువాత కడిగేయాలి.
- ◆ ఒక చెంచా బాదాముల పొడి, 2 చిన్న చెంచాలు పాలు, చిటకెడు పసుపు కలిపి లేపనం చేయాలి.
- ◆ సబ్బుకు బదులుగా సున్నిపిండి వాడకం లాభదాయకం.
- ◆ ఒక చిన్న చెంచా సోయాబీన్స్ పొడి, పెరుగు కలిపి రాసుకుంటే. చక్కని బ్లీచ్ జరుగుతుంది.
- ◆ కీరాలు, టొమాటోల గుజ్జులో బాదాముల పొడి కలిపి, వారానికి కనీసం మూడుసార్లు ముఖానికి రాసుకోవాలి.

ఏంచేయాలి? ఏది వద్దు?

- వేసవిలో సన్‌బాత్ తీసుకోకూడదు.
- అవసరానికి మించి ఎండలో తిరగకూడదు. ఉదయం 10 గంటల నుంచి, సాయంకాలం నాలుగువరకూ సూర్యరశ్మిలోని అల్ట్రా వయొలెట్ కిరణాల శక్తి అత్యదికంగా ప్రభావితం చేస్తాయి.
- బయటికి వెళ్లే ముందు 18-35 ఎస్ పెలఫ్ గల సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. ఏదోలే అనుకోకుండా బాగా రాసుకోవాలి.
- చర్మాన్ని రక్షించేందుకు కాస్తంత లూజుగా వుండే కాటన్ బట్టలను ధరించాలి.
- చర్మానికే కాదు, ఎండవల్ల కళ్లకూ హానికలుగుతుంది. కళ్ళను యువి కారణాల నుంచి రక్షించుకునేందుకు తగిన కళ్ళజోడు పెట్టుకోవాలి.

- స్నేహ డెస్క్





అందమైన అతిథి

జనవరి మొదలు జులై వరకు రంగురంగుల పక్షులు అక్కడ కనిపిస్తాయి. ప్రాంతీయ, భాషా బేధాలు మనుషులకే కానీ మాకు లేవంటూ వందల, వేల కిలోమీటర్ల నుండి వలస వస్తాయి. పిల్లలు ఎండాకాలం సెలవులకు ఊరెళ్లినట్లు ఈ పక్షులు కూడా సంవత్సరంలో ఆరు నెలలు ఇక్కడికి వచ్చి సేద తీరుతాయన్నమాట. ఇలా ఒకటి రెండు సంవత్సరాలు కాదు... కొన్ని దశాబ్దాలుగా ఈ పక్షులు వలస వస్తూనే ఉన్నాయి. నాలుగైదు వసంతాల కంటే ఎక్కువ జీవితకాలం లేని ఈ పక్షులకు పుట్టిల్లు అనంతపురం జిల్లాలోని వీరాపురమైతే మెట్టిల్లు రష్యాలోని సైబీరియా ప్రాంతం.

ఈ పక్షులకి మీ, మా అనే బేధం లేదు. కొత్త పాత అనే ప్రసక్తే ఉండదు. ఎందుకంటే ప్రతి సంవత్సరం ఇక్కడికే వస్తాయి మరి. ఆత్మీయంగా కళ్లతో పలకరిస్తాయి. తమ రంగు రంగుల రెక్కలతో స్థానికులను ఆకట్టుకోవడమే కాదు... పర్యాటకుల్నీ ఆకర్షిస్తున్నాయి. ఎక్కడో సుదూరంగా ఉన్న రష్యాలోని సైబీరియా పక్షులు ఖండాంతరాలను దాటి అనంతపురం జిల్లా, హిందూపురం తాలూకా చిలమత్తూరు మండలంలోని వీరాపురానికి చేరతాయి. వీటికి ఈ ప్రాంతం వేసవి విడిది. ఇక్కడే గూళ్లు కట్టుకుని, గుడ్లు పెట్టి, పొదిగి, పిల్లల్ని పెద్ద చేసి వాటితో సహా తిరిగి సైబీరియాకు వెళ్లిపోతాయి.

ఆశ్చర్యం కలిగించే విషయమేంటంటే నిత్యం నీళ్లతో జలకాలాడాల్సిన ఈ పక్షులు అనంతపురం వంటి కరువు ప్రాంతాల్లో నెలల తరబడి ఉండడం.

కొంగ జాతికి చెందిన ఈ అరుదైన పక్షుల శాస్త్రీయ నామం 'ఐబిస్ లూ కాషిపలస్'. కానీ వీటికున్న ఆకర్షించే రంగుల వల్లనేమో 'పెయింటెడ్ స్టార్క్స్' అని పిలుస్తారు. అయితే స్థానిక ప్రజలు మాత్రం ఈ పక్షులను 'ఎర్రకాళ్ల కొంగలు' అని పిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం జనవరి - ఫిబ్రవరి నెల (మాఘమాసం)లో వస్తాయి. జులై (శ్రావణమాసం) నెలలో తిరిగి తమ స్వదేశానికి ప్రయాణమౌతాయి. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏంటంటే ముందుగా కొన్ని పక్షులు డిసెంబర్ నెలాఖరులోనే ఈ ప్రదేశానికి చేరుకుంటాయి. వాతావరణం తమకు అనుకూలంగా ఉందో లేదోనని ఆ ప్రాంతాన్నంతటినీ పరిశీలించి వెళతాయి. అంటే ఇక్కడి చెరువులోని నీరు, వాటికి కావలసిన ఆహారం... ఇలా అన్నీ



గమనిస్తాయన్నమాట. అవి వెళ్లిన నాలుగైదు రోజుల తర్వాత వేలాది పక్షులతో ఇక్కడికి చేరుకుంటాయి. ఒక్కోసారి వర్షాలు పడక ఈ ప్రాంతాల్లో నీరు లేనప్పుడు, ప్రతికూల వాతావరణం ఏర్పడినప్పుడు పక్షులు ఇక్కడికి రావు. గతంలో పలుమార్లు రాని సందర్భాలు కూడా ఉన్నాయి.

పక్షుల ఆకారం....

వీటి దేహ నిర్మాణాన్ని పరిశీలిస్తే మగపక్షి, ఆడపక్షి ఒకే విధంగా కనపడతాయి. మెడ నుండి ముక్కు వరకు పసుపు పచ్చరంగు కలిగి ఉంటాయి. శరీరంపై అతి తక్కువ ఈకలు ఉంటాయి. మెడ ఒక విధమైన వంపు తిరిగి రెండు రెక్కల నడుమ, కడుపు భాగాన నలుపు రంగుతో చూడ ముచ్చటగా ఉంటుంది. రంగురంగుల ఈకలతో కూడిన రెక్కలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. తోక భాగం ఆకర్షించే ముదురు రంగుల్లో ఉంటుంది. ఒక్కో పక్షి నాలుగైదు కిలోల బరువు ఉంటుంది. మూడున్నర అడుగుల దాకా ఎత్తు ఉంటుంది. ఈ పక్షులు మామూలు కొంగల కంటే పెద్దగా ఉంటాయి. ఇంత అందంగా కనిపించే ఈ పక్షుల జీవితకాలం నాలుగైదు సంవత్సరాల కంటే ఎక్కువ ఉండదు.

ఆహారం, సంతానోత్పత్తి...

ఇవి కప్పలు, చేపలు, పురుగులను తింటాయి. గ్రామంలోని రావి, చింత, కొబ్బరి చెట్లపై నివాసం ఏర్పరచుకుంటాయి. ఒక్కొక్క చెట్టుపై 20 నుండి 30 వరకు గూళ్లు కట్టుకుంటాయి. ఈ పక్షులు దాదాపు మూడు నుండి నాలుగు వరకు గుడ్లు పెడతాయి. ఇవి గోధుమ రంగు మచ్చలు కలిగిన లేత తెలుపురంగులో ఉంటాయి. ఐదు నుండి ఎనిమిది వారాల లోపు ఈ గుడ్ల నుండి పిల్లలు బయటికి వస్తాయి. పిల్లలకు రెక్కలు వచ్చి ఆకాశంలో ఎగిరే శక్తి వచ్చేవరకు ఈ పక్షులు ఇక్కడే ఉంటాయి. గుడ్లను, చిన్న పిల్లలను తల్లి పక్షులు కంటికి రెప్పలా కాపాడుకుంటాయి. మగపక్షి ఆహారానికి వెళ్లినప్పుడు ఆడపక్షి, ఆడపక్షి ఆహారానికి వెళ్లినప్పుడు మగపక్షి పిల్లల సంరక్షణ బాధ్యత తీసుకుంటుంది. ఇవి కేవలం సంతానోత్పత్తి కోసమే ఇక్కడికి వస్తున్నట్లు శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. గుడ్లను పొదిగి పిల్లను చేయడానికి అనువైన వాతావరణ పరిస్థితి ఉండడం వల్లనే అవి ఇక్కడికి వస్తున్నాయట.

ఉనికే ప్రశ్నార్థకం!

సుదూర ప్రాంతాల నుండి వస్తున్న ఈ పక్షుల ఉనికి రోజు రోజుకు ప్రశ్నార్థకంగా మారింది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న రష్యా, సైబీరియా వంటి చలి ప్రదేశాల నుండి ఇక్కడికి వస్తున్న వీటి సంరక్షణ బాధ్యత గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటీవలి కాలంలో కొందరు దుండగులు రాత్రి పూట పక్షులను తుపాకులతో వేటాడి చంపడం ఆందోళన కలిగించే అంశం. అటవీ శాఖ అధికారులు కూడా పట్టించుకోవట్లేదని పక్షుల ఉనికి పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విదేశీ పక్షుల రాకపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. అసలు ఎప్పటి నుండి ఈ పక్షులు వీరాపురానికి వస్తున్నాయనే విషయం ఈ గ్రామంలోని వృద్ధులు సైతం ఖచ్చింగా చెప్పలేకపోతున్నారు. తాతల కాలం నుండి ఈ పక్షులు వస్తున్నాయని మాత్రం అంటున్నారు.

అభివృద్ధి చర్చలు...

దశాబ్దాలుగా ఈ ప్రాంతానికి వస్తున్న విదేశీ పక్షుల సంరక్షణ గురించి అప్పటి కలెక్టర్ కోమేష్ కుమార్ మినహా ఇతర అధికారులెవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. పక్షుల నమూనాలను కొడికొండ చెక్‌పోస్టువద్ద, మరక కొత్తపల్లి సమీపంలో ఏర్పాటు చేయించి పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు దోహదపడ్డారు.

వీరాపురంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఆ గ్రామ పరిసరాల్లో పక్షుల సందర్శన కేంద్రం (బర్డ్స్ శాంక్చువరీ) కోసం



స్థలాన్ని ఏర్పాటు చేసి త్వరలోనే నిర్మించనున్నట్లు ప్రకటించారు కూడా. పక్షులను స్పష్టంగా చూడడానికి పెద్ద టవర్లను ఏర్పాటు చేసి బైనాక్యులర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. అయితే ఆయన బదిలీ కావడంతో పక్షుల సంరక్షణ కేంద్రం ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది.

వలస పక్షులపై సెజ్ ప్రభావం...

చిలమత్తూరు మండల పరిధిలో సెజ్‌ల కోసం ప్రభుత్వం వేల ఎకరాలను సేకరిస్తుంది. వీరాపురంలో కూడా సేకరిస్తున్నట్లు వినికిడి. ఇదే గనుక జరిగితే ఆ ప్రాంతం పర్యాటక అభివృద్ధికి దూరమౌతుందని కొందరు స్థానికులు భయపడుతున్నారు.

మనుగడ ప్రశ్నార్థకం...

అరుదైన ప్రాంతాల్లో ఒకటిగా చెప్పుకునే వీరాపురంలో వలస పక్షులకు రక్షణ కరువవుతోంది. అవి సీమలో మరెక్కడా కనిపించవు. ఈ పక్షుల రాకతోనే వీరాపురానికి పర్యాటక కేంద్రంగా గుర్తింపు వచ్చింది. కారణమేదైనా నేడు వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

★





వెబ్ 'డబ్'

ఒక్క క్లిక్ చేస్తే చాలు! మీకు కావాల్సింది మీ ముందుంటుంది!! అది కడుపుబ్బ నవ్వించే జోక్స్.. సినీతారల హాట్ టాపిక్స్.. నోరూరించే వంటకాలు... షాపింగ్ మాల్స్ వివరాలు... ఆధ్యాత్మిక పాటలు, ఆపాత మధుర గీతాలు, క్రీడాంశాలు, కార్పొరేట్ అంశాలు, యాత్రల వివరాలు, సాఫ్ట్‌వేర్ విశేషాలు...మీకు ఇష్టమైనవి ఏవైనా సరే వెబ్‌సైట్లో మీ ముందుంటుంది. ఆసక్తికే అగ్ర తాంబూలం. అందుకే ఈ మధ్య వెబ్ డిజైనింగ్‌కు ప్రాధాన్యత పెరిగిపోయింది. వినోదానికి వినోదం... ఉపాధికి ఉపాధి. వెబ్ డిజైనింగ్ కొందరికి వినోదాన్ని, మరికొందరికి ఉపాధిని అందిస్తోంది. సాఫ్ట్‌వేర్ కోర్సులు చేసిన యువత ఇప్పుడు అందివచ్చిన ఈ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుంటోంది. ఆ ఆసక్తికర విశేషాలు ఈ వారం అట్టమీది కథలో...

బాదరాయణ సంబంధం... 'మీ ఇంట్లో రేగు చెట్టుంది, మా ఇంట్లో రేగు చెట్టుంది. కనుక మనం మనం ఒకటి' అని దానర్థం. సాధారణంగా ఈ నుడికారాన్ని వ్యంగ్యంగా వాడతారు.

ఇప్పుడు ఇదే సూత్రం ఇంటర్నెట్ ప్రపంచంలో ఎందరో జీవితాల్ని ఊహించని విధంగా మార్చేస్తోంది...

ఇంటర్నెట్ వచ్చాక ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోయిందని ఎప్పటినుండో వింటున్నాం.... చూస్తున్నాం... ఈ ఇంటర్నెట్ ప్రపంచంలో బాదరాయణ బంధం అన్ని రకాల వారినీ దగ్గర చేస్తోంది. ఖండాంతరాల ఎల్లలు చెరిపేస్తూ కుటుంబ సభ్యుల భావన కలిగిస్తోంది....

ఇంటర్నెట్ వ్యాపారం చేయదలచుకున్నవారు... వెబ్‌సైట్ల ద్వారా డాలర్లు [illegible]దించదల్చుకున్నవారు... ముందుగా ఈ ప్రాథమిక ఇంటర్నెట్ రహస్యాన్ని అర్థం చేసుకోవాలి....

ఎందుకంటే....

ఇంటర్నెట్ అలవాటైతే అందరిదీ ఒకే కులం.. అదే ఈ-కులం.

ఓ మీడియా సంస్థ పెట్టాలంటే ఇప్పుడు రూపర్ట్ మర్డోచ్ లే అవ్వాల్సిన పని లేదు... కేవలం ఒకే ఒక వెబ్ సైట్‌తో మన సందేశాన్ని, సమాచారాన్ని, ఆసక్తికర అంశాల్ని ప్రపంచానికి తెలియజేయవచ్చు... వెబ్ సైట్‌కి వినియోగదారుల్ని పెంచుకుని మరో వైపు డబ్బూ సంపాదించవచ్చు...

ఇప్పుడు ఇంటర్నెట్ వెబ్‌సైట్ల నిర్వహణ చిన్నతరహా పరిశ్రమల్ని తలపిస్తోంది....
ఇక్కడ పర్మిషన్లకి ప్రభుత్వ అధికారుల చేతులు తడపాల్సిన పని ఉండదు. ఎన్ ఓసీల గురించి షూస్ అరిగేలా చక్కర్లు కొట్టక్కర్లేదు... కేవలం ఇంట్లో కూర్చునే కొన్ని గంటల సమయాన్ని కేటాయించి వేలు సంపాదించొచ్చు.

వెబ్ సైట్లు భవిష్యత్తుపై చేసిన కొన్ని గణాంకాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఆసక్తిని పెంచుతాయి...

'మనదేశంలో 2011 ఆర్థిక సంవత్సరం ఆన్‌లైన్ అడ్వర్టైజింగ్ మార్కెట్ అంచనా 1100 కోట్ల రూపాయలు. ఇంటర్నెట్ అండ్ మొబైల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐ.ఎం.ఎ.ఐ)' అంటే ఈ ఏడాది 1100 కోట్ల రూపాయల విలువైన ప్రకటనలు వెబ్‌సైట్లలో రాబోతున్నాయి....

సృజనాత్మకతకే పెద్ద పీట

మన రాష్ట్రం నుండి వెబ్‌సైట్లు ఎక్కువగా సినీ వినోదం ప్రధానంగా నడుస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి....

greatandhra.com,
idlebrain.com, teluguone.com,
cinejosh.com, andhravilas.com

ఇవి కాకుండా తెలుగులో రాజకీయ, సమాచార, క్లాసిఫైడ్, రియల్ ఎస్టేట్ వెబ్‌సైట్లు కూడా వున్నాయి.

వెబ్ సైట్ల నిర్వహణని వ్యాపారం చేసుకోవాలని భావించేవారికి మాత్రం ఇటువంటి పోర్టల్స్ లాభదాయకం కావని పలు నివేదికలు చెబుతున్నాయి. ఇటువంటి పోర్టల్స్ మధ్య వుండే పోటీ, ఒకే సమాచారం అన్నింటిలో పునరావృత్తం కావడం, నిర్వహణ తదితర అంశాలు అవకాశాల్ని దెబ్బతీస్తాయి.

ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐ.ఎం.ఎ.ఐ) తాజా నివేదిక ప్రకారం ఈ ఏడాది ఇంటర్నెట్ వ్యాపార ప్రకటనల్లో అధిక వాటా బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్‌దే... తర్వాత ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్.ఎం.సి.జి) ఎడ్యుకేషన్‌లది.

ఐ.ఎం.ఎ.ఐ పేర్కొన్న రంగాలకు సంబంధించిన వెబ్ పోర్టల్స్ పెట్టుకుంటే ప్రయోజనం బాగుంటుంది. మన దగ్గర ఈ రంగాలపై ఉన్న పోర్టల్స్ అరుదనే చెప్పాలి. ఎడ్యుకేషన్ పైన మన రాష్ట్రానికి కొన్ని సైట్స్ ఉన్నా అవి ముంబై, ఢిల్లీల నుండి ఆయా ప్రాంతాల వారు నిర్వహిస్తున్నారు. ఇక్కడ గట్టి పోటీ ఇవ్వొచ్చు.

బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్‌పై మన దగ్గర పోర్టల్స్ లేవు... ఈ రంగాలపై దేశవ్యాప్తంగా బిజినెస్ సైట్లు ఉన్నాయి. స్టేట్ స్పెసిఫైడ్ పోర్టల్స్ ప్లాన్ చేసుకుంటే లబ్ధి

పొందొచ్చు....

వెబ్‌సైట్లలో రాణించాలంటే అందరూ పెట్టిన లాంటిది కాకుండా కొత్తగా ఉండాలి. అదీ యూజర్స్‌కి ఉపయోగపడేట్లు... అప్పుడే సక్సెస్ సాధించొచ్చు.

ప్రపంచంలోనే మొట్టమొదటి ఈ మెయిల్ సర్వీస్ hotmail.com సృష్టికర్త సబీర్ భాటియా. ఆ సంస్థని 1999లో 400 మిలియన్ డాలర్లకి మైక్రోసాఫ్ట్‌కి అమ్మాడంటే కేవం సబీర్ భాటియా క్రియేటివిటీయే కారణం.

hotmail.com అమ్మకం తర్వాత సబీర్ భాటియా ట్రావెల్స్ పై పెట్టిన arzoo సైట్ మాత్రం ఫ్లాప్ అయింది. ఓ ఐడియా జీవితాన్నే మార్చేస్తుందంటే అది hotmail.com ద్వారా సబీర్ భాటియా కి బాగా ఉపయోగపడింది.

సరదాగా ప్రారంభించిన ఎన్నో వెబ్‌సైట్లు పూర్తి ప్రొఫెషనల్‌గా ఎందరికో లక్షలాది రూపాయలు సమకూర్చి పెడుతున్నాయి. కొందరు తమకు తెలిసిన సాఫ్ట్‌వేర్ స్కిల్స్ ఆన్‌లైన్ ద్వారా ఇతరులకి నేర్పించి డబ్బు ఆర్జిస్తున్నారు.

ebay.com, amaazon.com వంటి ఆన్ లైన్ స్టోర్స్ మన దగ్గర లేవు. కొన్ని భారతీయ సంస్థలు ఇటువంటివి నిర్వహిస్తున్నా ముంబై, ఢిల్లీ నగరాలకే పరిమితమవుతున్నాయి. ఆన్‌లైన్ బుక్ స్టోర్స్ అంటే మనవద్ద గుర్తొచ్చేది ఆజో భో కందాలం ఫౌండేషన్ www.avkf.org

'ఈ' ఆదాయం

ఇంటర్నెట్ వెబ్‌సైట్లు ఇప్పుడు డబ్బు పండిస్తున్నాయి. ఇక్కడ వ్యాపార ప్రకటనలకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ అవసరం లేదు. గూగుల్ ఆన్ లైన్ యాడ్స్ ప్రవేశపెట్టిన దగ్గర నుండి ఆన్‌లైన్ ఎడ్వర్టైజింగ్ బూమ్ వచ్చిందనే చెప్పొచ్చు. google.com\adsense లోకి లాగ్ ఇన్ అయి ఏ వెబ్‌సైట్ నిర్వాహకులైనా వ్యాపార ప్రకటనల్ని పొందొచ్చు. లాగ్ ఇన్ అవడం, అకౌంట్ పొందడం పూర్తిగా ఉచితం... ఈ ప్రాసెస్ మొత్తం కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో ముగించుకోవచ్చు.

వెబ్‌సైట్ నిర్వాహకులు ఎక్కడ ప్రకటన రావాలో ఆ ప్రాంతంలో google ads కోడ్ ఉపయోగిస్తే సంబంధిత ప్రకటన అక్కడ ప్రచురితమౌతుంది.

ఉదాహరణకి సినిమా పోర్టల్ వారు google కోడ్ ఉపయోగిస్తే వారికి సినిమా టికెట్లు, కొత్త సినిమాలు, పాటల డౌన్‌లోడ్ వంటి ప్రకటనలు వస్తాయి.

బ్యాంకింగ్ పోర్టల్స్ వారికి ఎస్.బి.ఐ క్రెడిట్ కార్డులు, ఐ.సి.ఐ.సి. ఐ బ్యాంక్ వంటి సంబంధిత ఆర్థిక, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ ప్రకటనలు వాటంతట అవే ప్రచురితమౌతాయి. ప్రకటనపైన యూజర్ క్లిక్ చేస్తే వెబ్‌సైట్ నిర్వాహకుల అకౌంట్లో డబ్బు జమ అవుతుంది. ఒకవేళ ప్రకటనని క్లిక్ చేయకపోయినా, ప్రతి వెయ్యి పేజ్ వ్యూస్‌కి కొద్ది మొత్తం డాలర్ల రూపంలో జమ అవుతుంది.

ఇక్కడో ముఖ్యమైన విషయాన్ని గమనించాల్సి ఉంటుంది. సినిమా ప్రకటనలకన్నా, బ్యాంకింగ్ ఇతర ఆర్థికపరమైన ప్రకటనలకు వచ్చే ఆదాయం ఎక్కువ.

వెబ్‌సైట్ నిర్వాహకుల్ని google సంస్థ పబ్లిషర్ గా పేర్కొంటుంది. పబ్లిషర్ ఏరోజు కారోజు google.com\adsense లోకి లాగ్‌ఇన్ అయి ఎన్ని డాలర్లు వస్తున్నాయో చూసుకోవచ్చు.

ఏ నెలలో 100 డాలర్లు దాటాయో ఆ తర్వాత నెల మొత్తం రూపాయల్లో మన ఇంటికి డీడీ వస్తుంది. గూగుల్ కాకుండా yahoo అనుబంధ సంస్థ sme media కూడా ప్రకటనలు ఇస్తోంది. google adsense తో పోలిస్తే కానీ ఈ ప్రకటనలకు పబ్లిషర్ల నుండి ఆశాజనకమైన స్పందన రావడం లేదు.

వెబ్‌సైట్ పెట్టడం ఎలా?

కొత్తగా వెబ్‌సైట్ పెట్టాలంటే ఐదు వేల రూపాయల నుండి 20 వేల దాకా ఖర్చవుతుంది. ప్రతి ఏడాదీ రెన్యువల్‌కి రెండు వేల నుండి ఐదు వేల దాకా ఖర్చవుతుంది.

గతంలో వెబ్‌సైట్ నిర్వహణ చాలా కష్టంగా ఉండేది. సైట్ పెట్టాలంటే వారికి ఫొటోషాప్, ఫ్రంట్ పేజ్, డ్రీం వీవర్, హెచ్.టి.ఎం.ఎల్ వంటి సాఫ్ట్‌వేర్ కోర్సులు అవసరమయ్యేవి. ఇప్పుడు ఇదంతా చాలా తేలికైపోయింది.

ఒకే ఒకసారి సైట్ డిజైన్ చేయిస్తే దాన్ని ఎవరైనా అప్‌డేట్ చెయ్యొచ్చు. ఎంత తేలికంటే ఈ మెయిల్ పంపించినంత. కొత్తగా వచ్చిన ఈ ఆధారాన్ని కంటెంట్ మేనేజ్‌మెంట్ సర్వీస్ (CMS) అంటారు.

దీని ద్వారా న్యూస్ పోర్టళ్లు, వ్యాపార సంస్థల వెబ్‌సైట్లు, పర్సనల్ వెబ్‌సైట్లు ఏవైనా డిజైన్ చేయడం కేవలం ఐదు నుండి 10 గంటల పని. ఓ సారి డిజైన్ జరిగాక సదరు యజమాని దాన్ని తెలిగ్గా మార్చే వెసులుబాటు ఉంది. వీటిని అందుబాటులోకి తెస్తున్న ప్రధానమైన సాఫ్ట్‌వేర్లు మూడు. drupal, joomla, wordpress.

వెబ్ నిర్వాహకులు... కొన్ని సూచనలు

వెబ్‌సైట్ నిర్వాహకులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఇంటర్నెట్లో ఎక్కువమందికి తమ సైట్‌ని చేరువ చేయవచ్చు.

- వెబ్‌సైట్లు ఇతరులకు తెలియాలంటే ప్రధానంగా వారు ఆధారపడే సాధనం గూగుల్ డాట్ కామ్... గూగుల్ ఫ్రెండ్లీ సైట్ తయారు చేయాలి.
- కాపీ కంటెంట్ సైట్‌ని గూగుల్ ప్రాధాన్యత క్రమంలో ఆఖర్న చూపిస్తుంది. సాధ్యమైనంత కొత్త విషయాల్ని చూపించే ప్రయత్నం చేయడం. ఈ సైట్ మిగిలిన వాటికి భిన్నంగా ఉంటే గూగుల్‌లో మొదట్లోనే వచ్చే అవకాశం ఉంటుంది.
- సినిమా, వినోదం కాకుండా కొత్త అంశాలపై ప్లాన్ చేయాలి.
- facebook.com, orkut.com, twitter.com, kotklix.com తదితర సోషల్ నెట్ వర్కింగ్ సైట్లలో నిర్వాహకుల వెబ్‌సైట్ సమాచారాన్ని పోస్ట్ చెయ్యాలి. ఫీడ్ బర్నర్ అనే సౌకర్యాన్ని వాడుకోవచ్చు.
- నిర్వాహకుల సైట్ నుండి ఇతర సైట్లకి ఎక్కువ లింకులు ఉండేట్లు చూసుకోవాలి. అదే విధంగా ఇతర సైట్లనుండి నిర్వాహకుల సైట్‌కి లింక్







ఉండేట్లు తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కువ లింకుల ఆధారంగా గూగుల్ సెర్చ్ ఇంజన్ సంబంధిత సైట్లకి పేజ్ ర్యాంక్ ఇస్తాయి. సెర్చ్ ఇంజన్లో మొదట్లో రావడానికి ఆధారం పేజ్ ర్యాంక్. గూగుల్ పేజ్ ర్యాంక్ గైడ్‌లైన్స్ అధ్యయనం చెయ్యొచ్చు.

సమాచారమే పెట్టుబడి

అక్కడ కాఫీ ఉండదు... కానీ అది ఓ కేఫ్. సర్వర్ల పదం వినిపిస్తుంది. కానీ సర్వర్లని పిలిస్తే రారు. ఏమా కేఫ్... ఎవరా సర్వర్లు... అని ఎవరైనా పొడుపు కథ వేస్తే ఠక్కున 'ఇంటర్నెట్ కేఫ్' అని చెప్పేయొచ్చు.

మన దేశంలో 37 శాతంమంది నెట్ కోసం ఇంటర్నెట్ కేఫ్‌లనే వాడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. వాటి ఆధారంగా చేసుకుని ఓ రిపోర్టు విడుదలైంది.

ఇంటర్నెట్ యూజర్లు ఎక్కువగా నెట్‌ను ఎందుకు వాడుతున్నారు? బ్రౌజర్లు ఎక్కువగా ఇంటర్నెట్‌ని సర్ఫ్ చేసేది ప్రధానంగా ఐదు అంశాల కోసం : ఈ మెయిల్, ఎల్లో పేజెస్ (డైరెక్టరీ), బ్యాంకింగ్, న్యూస్ అండ్ ఎంటర్టైన్‌మెంట్, సోషల్ నెట్‌వర్క్ సైట్లు...

అత్యధిక శాతం సమాచారాన్ని రాబట్టడానికి google.com ని అత్యధికంగా వాడుతున్నారు. మనం కోరుకున్న సమాచారాన్ని కోరుకున్నట్లుగా accuracy తో చూపించడమే google సక్సెస్‌కి ప్రధాన కారణం.

1994లో ఇంటర్నెట్‌లోకి ప్రవేశించి సంచలనం సృష్టించిన yahoo.com 1998లో ప్రవేశించిన google తో వెనకపడింది. ఇప్పుడు మనదేశంలో కూడా google మొదటి స్థానంలోఉంది. ఎన్నో కొత్తకొత్త ప్రొడక్ట్స్‌తో ఆకట్టుకుంటోంది. ఏ వెబ్‌సైట్ వారైనా తమ సమాచారాన్ని, అదే విధంగా న్యూస్‌ని google ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అందరితో షేర్ చేసుకోడానికి అవకాశం ఉంది.

google సెర్చ్ ఇంజన్ ప్రపంచంలోని ఏ సైట్‌లోని సమాచారాన్ని అయినా సెర్చ్ చేసిన వారికి క్షణాల్లో ముందుంచుతోంది. సైట్ నిర్వాహకులు సరైన సమాచారాన్ని అందించగలిగితే చాలు... డాలర్లు... బాబోయ్ డాలర్లు...

సరదాగా వెబ్‌సైట్ ప్రారంభించి తర్వాత తమ ఉద్యోగాల్ని కూడా వదిలి పూర్తిగా వ్యాపారంలోకి దిగిన వారు ఎందరో ఉన్నారు. ఆదాయం పెరిగాక వ్యాపారాన్ని విస్తరించిన పబ్లిషర్స్ ఎందరో google.com adsense ప్రకటనల ద్వారా వేలాది అమెరికా డాలర్లు పొందుతున్న వారి జయ గాథలు ఆసక్తిని కలిగిస్తాయి.

Digg.com RC తలసరి ఆదాయం అక్షరాలా రెండు లక్షల డాలర్లు. అంటే దాదాపు 90 లక్షల రూపాయలు. 2004 డిసెంబర్‌లో ద్వితీయ వ్యాపకంగా రోజ్ అనే వ్యక్తి మొదలెట్టిన సైట్.

వ్యాపారంలో, ఇంటర్నెట్, మార్కెటింగ్ తదితర అంశాలపైన ఆశక్తి ఉన్న వారి కోసం ఏర్పాటు చేసిన digitalpoint.com వెబ్‌సైట్ నిర్వాహకులు నెలకి నాలుగున్నర లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఈ సైట్ నిర్వహణకి వారికి అయ్యే ఖర్చు కేవలం రెండువేల రూపాయలు. వ్యక్తుల అభిప్రాయాలు, ప్రశ్నలు, వాటికి జవాబులు. ఇలా వారిని ఇన్‌వాల్వ్ చేస్తూ ఈ సైట్ డిజైన్ చేశారు. సాంకేతిక అంశాలపై ఏర్పాటు చేసిన labnol.org లక్షలాది రూపాయలు ఆర్జిస్తోంది.

ప్రపంచంలో ఇంటర్నెట్ వినియోగదారుల్లో మూడో అది పెద్ద దేశం మనది. మన దేశంలో పదికోట్లమంది ఇంటర్నెట్ వాడుతున్నారు. అమెరికా, జపాన్, సౌత్ కొరియాలతో చూస్తే ఇంటర్నెట్ అంత వేగంగా ముందుకెళ్లడం లేదనే చెప్పాలి. దీనికి ప్రధాన కారణం, ప్రతిబంధకం ఇంటర్నెట్ బ్యాండ్ మన వద్ద ఇంటర్నెట్ కనెక్షన్ ధర వెస్ట్రన్ యూరప్, యు.కె, యునైటెడ్ స్టేట్స్‌తో పోలిస్తే చాలా ఎక్కువ.

2012 నాటికి ప్రతీ గ్రామానికి బ్రాడ్ బ్యాండ్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ఇదే నిజమైతే ఇంటర్నెట్ వినియోగదారుల్లో మనదేశం నెంబర్ వన్ స్థానం ఆక్రమించే అవకాశం ఉంది. బ్రాడ్ బ్యాండ్ సేవల్ని అందించడమే కాదు అందుబాటు ధరల్లో ఇంటర్నెట్ ప్రజల ముంగిటకు రావాల్సి ఉంది. 1999లో రిలయన్స్ సంస్థ మన్సూన్ హంగామా పేరిట 500 రూపాయలకే మొబైల్ ఫోన్లని అందుబాటులోకి తీసుకువచ్చి ఇప్పుడు మొబైల్ ఫోన్ల వినియోగాన్ని , మార్కెట్‌ని ఎలా పెంచేసిందో అందరికీ తెలిసిందే.

వంద రూపాయలకే అపరిమిత ఇంటర్నెట్, అత్యధిక బ్యాండ్ పేరిట భవిష్యత్తులో నెట్ అందుబాటులోకి వస్తే కేవలం వెబ్ సైట్సే కాదు ఔత్సాహికులు ఇంటర్నెట్, టీవీ లు కూడా పెట్టేయొచ్చు. కేవలం రెండు వేలకే. ఇది ఎంతో దూరంలో లేదు మరి.

-ఉండవల్లి పవన్ కుమార్,
pavanundavalli@gmail.com



స్ట్రాబెర్రీ డిలైట్

కావలసిన పదార్థాలు

స్ట్రాబెర్రీ - 1 కప్పు, యాపిల్ ముక్కలు - 1 కప్పు
జామకాయ ముక్కలు - 1 కప్పు, తేనె - 2 స్పూన్లు
నల్ల ఉప్పు - చిటికెడు

తయారు చేసే విధానం

స్ట్రాబెర్రీ ముక్కలు, జామకాయ ముక్కలు, యాపిల్ ముక్కలు నల్ల ఉప్పు కలిపి మిక్సీ వెయ్యాలి. ఇందులో తేనె కలుపుకుంటే స్ట్రాబెర్రీ డిలైట్ రెడీ. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే స్ట్రాబెర్రీలు ఆరోగ్య సమస్యల్ని దరిచేరకుండా కాపాడుతాయి. ఎండలో అలసి వచ్చిన వారికి ఈ డ్రింక్ మంచి రిఫ్రెష్‌మెంట్.



మిక్స్‌డ్ జ్యూస్

కావలసిన పదార్థాలు

నారింజ రసం - అరగ్లాసు
బత్తాయి రసం - అరగ్లాసు
యాపిల్ రసం - అరగ్లాసు
టమాటా రసం - అరగ్లాసు
యాలకుల పొడి - చిటికెడు
కుంకుమ పువ్వు - చిటికెడు
బాదం పప్పులు - ఆరు

తయారు చేసే విధానం

బాదం పప్పు నానబెట్టి పొట్టు తీసి చిన్న ముక్కలు చెయ్యాలి. అన్ని పళ్ల రసాలు విడివిడిగా తీసి పెట్టుకోవాలి. తర్వాత అన్నింటినీ కలిపి ఒక గిన్నెలో పోయాలి. దానికి బాదం ముక్కలు, యాలకులపొడి, కుంకుమ పువ్వు వేసి కలపాలి. గ్లాసులో పోసుకుని తాగేటప్పుడు ఇష్టమైన వాళ్లు అందులో ఐస్‌ముక్కలు వేసుకోవచ్చు.

పుచ్చకాయ జ్యూస్

కావలసిన పదార్థాలు

పుచ్చకాయ ముక్కలు - 2 కప్పులు
పంచదార - 3 స్పూన్లు, అల్లం - చిన్న ముక్క

తయారు చేసే విధానం

పుచ్చకాయ ముక్కల్ని గింజలతో సహా మిక్సీలో వెయ్యాలి. అందులోనే పంచదార, అల్లం ముక్క వేసి అవి మెత్తగా అయ్యేవరకు మిక్సీ తిప్పాలి. తర్వాత జ్యూస్‌ని వడగట్టి గ్లాసులో పోసుకుని తాగేయడమే.



కర్బూజ జ్యూస్

కావలసిన పదార్థాలు

కర్బూజ ముక్కలు - 2 కప్పులు, పాలు - 2 కప్పులు
బెల్లం - నాలుగు స్పూన్లు, యాలకుల పొడి - చిటికెడు
జాజికాయపొడి - చిటికెడు

తయారు చేసే విధానం

కర్బూజ పండు చెక్కుతీసి ముక్కలు చేసి గింజలు తీయాలి. పాలు, బెల్లం, గింజలు తీసిన కర్బూజ ముక్కలు మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకుని ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలో వడకట్టాలి. దీనికి యాలకుల పొడి, జాజికాయ పొడి కలపాలి. అంతే. కర్బూజ జ్యూస్ రెడీ. దీన్ని తాగేముందు ఐస్‌ముక్కలు వేసుకుంటే చల్లగా బావుంటుంది. పోషకాలు సమృద్ధిగా ఉన్న కర్బూజ జ్యూస్‌ని తాగడానికి పిల్లలూ, పెద్దలూ ఇష్టపడతారు.



డ్రైఫ్రూట్ మ్యాంగో డిలైట్

కావలసిన పదార్థాలు

మామిడిపండ్లు - 4, బాదం పప్పు - 2 స్పూన్లు
యాలకుల పొడి - చిటికెడు, పంచదార - 3 స్పూన్లు
కస్టర్డ్ పౌడర్ - 3 స్పూన్లు, క్రీం - ముప్పావు కప్పు
పిస్తా పప్పు - 1 కప్పు, పాలు - 1 కప్పు

తయారు చేసే విధానం

ముందుగా మామిడి పండ్లను చెక్కు తీసి ముక్కలు చెయ్యాలి. వాటిని మిక్సీలో వేసి మెత్తని గుజ్జు చెయ్యాలి. పాలల్లో కస్టర్డ్ పౌడర్‌ని వేసి ఉండలు లేకుండా కలపాలి. పంచదార, కస్టర్డ్ పౌడర్ వేసిన పాలు కలిపి సన్నని మంట మీద ఉడికించాలి. ఇది చిక్కగా అయిన తర్వాత మంట ఆర్పి యాలకుల పొడి కలిపి చల్లార్చాలి. చల్లారిన తర్వాత మామిడి గుజ్జు, క్రీం, చిక్కగా అయిన మిశ్రమానికి కలిపి ఫ్రిజ్‌లో పెట్టాలి. బాదం, పిస్తాపప్పులను సన్నని ముక్కలుగా చేసుకుని పైన చల్లుకుంటే బాగుంటుంది.



ఆహ్వానం

ఘుమఘుమలాడే వంటకాలు చేయడంలో మీకు ఎనలేని ఆసక్తి వుందా! ప్రయోగాత్మక వంటకాలు చేసి అతిథులకు వడ్డించి మెప్పించగలరా! చవులూరింపచేసే సంప్రదాయ శాకాలు చేయడంలో దిట్టా! ఎండన పడి వచ్చిన వారికి చిటికెలో చల్లని పానీయాలు అందించేస్తారా? మరెందుకండీ ఆలస్యం? ఎంచక్కా వాటిని ఓ కాగితం మీద రాసి పంపండి. తగిన పారితోషికం అందుకోండి. ముఖ్యమైన విషయం! మీ చిరునామా పూర్తిగా రాయడం మరువకండి.

మీ రుచులు పంపాల్సిన మా అడ్రస్:
రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు.

కథ



రాత్రి మనిషి

ఆ చుట్టుపక్కల నాలుగైదు గ్రామాలవారికి అతను పరిచితుడే. శవదహనం చేయటంలో అతనిది ప్రత్యేక పద్ధతి. గంజాయి బిగించి, మృదంగం వాయిస్తూ కీర్తనలు పాడుతూ దహనసంస్కారం పూర్తి చేస్తాడు.

శవాన్ని కట్టెలపైకి చేర్చి నిప్పు అంటించాక, ఆ ప్రదేశానికి దగ్గర్లోనే నిలబడతాడు. మూడడుగుల చేతికర్రతో శవాన్ని అటూ ఇటూ కదుపుతుంటాడు. తల పగిలి మెదడు చిట్లటం నుంచి మోకాలి చిప్ప నుంచి కాలు విడిపోవడం వరకు అన్నీ దగ్గరుండి గమనించి శవం పూర్తిగా కాలేలా చూస్తాడు. క్షణాల్లో శవం స్థానంలో బూడిద ప్రత్యక్షమవుతుంది.

తెల వెంట్రుకలు, చేతులు, కాళ్ల గోళ్లు, శరీరాన్ని అంటి పెట్టుకున్న వస్త్రాలు అన్నీ రకరకాల ఆనవాళ్లతో శ్మశానంలో మిగులుతాయి. వాటినే అపురూపంగా స్వీకరిస్తారు మృతుని బంధువులు. కార్యక్రమం అంతా పూర్తయ్యాక అతను ఇంటికొస్తాడు. ఒంటినిండా నూనె పట్టించుకుని మసాజ్ చేసుకుంటాడు. "కార్యక్రమం అంతా సజావుగా సాగిపోయింది. అంతా భగవంతుని దయ" అని తనను తనే ప్రశంసించుకుంటూ మురిసిపోతాడు.

కలరా వచ్చినపుడో – వరదలు లాంటివి వచ్చి మూకుమ్మడిగా ప్రాణాలు పోగొట్టుకున్నప్పుడో అతనికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఆ వూళ్లోని జనం అతన్ని విపరీతంగా పొగుడుతారు. అతని మనసు గెలుచుకోడానికి రకరకాల దారులు వెతుకుతారు. "అయ్యా! చాచా" అంటూ బతిమాలుతారు.

"రాత్రి నుంచి శవం అలాగే ఉండిపోయింది. కంపు కొడుతోంది త్వరగా బయల్దేరు" అని ఒకరంటే, "పసుపు పారాణి ఆరకముందే ఆ నవవధువుకి భూమ్మీద నూకలు చెల్లిపోయాయి. ఏమైనా ముత్తైదువులా పోయింది. మిగిలిన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా పూర్తిచెయ్యి బాబూ!..." అంటారు మరికొందరు.

జగ్గు... అది అతని పేరు. అప్పుడు తనను తాను చూసి ఉప్పొంగి పోతాడు. ఒక రకమైన గర్వంతో.. ఆత్మ విశ్వాసం అతనిలో తొంగి చూస్తుంది.

అలాగని అతను డబ్బు విషయంలో రాజీపడడు. తను కోరిన పైకం ముట్టచెప్పాలి. దాంతో పది గ్రాముల గంజాయి, కాసింత ఓపియం, శవ దహనం పూర్తయ్యక స్నానం కానిచ్చి వేసుకోటానికి దుస్తులు, కర్మ పూర్తయ్యాక పదో రోజున పుష్టిగా భోజనం ఇవన్నీ తప్పనిసరి.

చనిపోయింది వివాహిత అయితే అతనికి చాలా లాభం. బాగా గిట్టుబాటవుతుంది. డబ్బున్న ఆడవాళ్లకి చెవి రింగులో, ముక్కు పుడకో ఇవ్వాలి. పేద స్త్రీ అయితే వెండి కాలిమట్టెలు మాత్రం సొంతం చేసుకుని సంతృప్తి చెందుతాడు. శవాన్ని చితిపై చేర్చిన తర్వాత ఒంటిపైన ఎలాంటి ఆభరణాలున్నాయనేది అతను నిశితంగా పరిశీలిస్తాడు. శవం నుంచి వాటిని తియ్యటం కష్టమనిపిస్తే గట్టిగా గుంజుతాడు. ముక్కు కొనలు, చెవుల తమ్మెలు ఒక్కోసారి తెగిపోతాయి. శవం నుంచి నీలం రంగు ద్రావకం.. అది రక్తం కాదు.. స్రవిస్తుంది. జగ్గు ఇదేమి లెక్క చెయ్యడు. అదంతా తన వృత్తిలో భాగమని విశ్వసిస్తాడు.

గర్భవతి అయితే మాత్రం అతను బోలెడు లెక్కలు చెబుతాడు. ఆ మేరకు డబ్బులు ముడితే సరేసరి, లేకపోతే శవాన్ని ముట్టనయినా ముట్టడు. అనుకున్న మేరకు అన్నీ చేతికందాక శవాన్ని జాగ్రత్తగా చితిమీదకు చేరుస్తాడు.

"రామ్ రామ్ సత్య హై" అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగుతాడు. అతని నల్లటి వంటిపై తెల్లటి జంధ్యం తళతళ మెరుస్తుంది. గ్రామంలో ఎవరైనా మరణిస్తే కుటుంబంలోని వారంతా శవం వెంట నడుస్తారు. పిల్లలు మాత్రం భయంతో తలుపులు వేసుకుంటారు.

ఏటా నూర్పిళ్ల సమయంలో వచ్చే ధాన్యం... వాళ్లు వీళ్లు ఇచ్చే డబ్బులతో అతను సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు. మొహం మీద అతన్ని ఎవరూ ఒక్క మాట కూడా అనరు. జగ్గు కాకుండా ఆ ఊరిలో సరైన బ్రాహ్మడు ఒక్కడు కూడా లేకపోవటమే అందుకు కారణం.

అలాగే తను చేస్తున్న పనికి అవతలి వాళ్లు ఇస్తున్న మొత్తం చాలా తక్కువని అతను చెప్పుకుంటుంటాడు. కథలు కథలుగా తన'పని' గురించి అతను చెప్పే విధానం అందరినీ ఆకట్టుకుంటుంది.

"వర్షంలో నర్సింగ్ మిశ్రా భార్యకు సరిగా శ్రాద్ధకర్మలు నిర్వర్తించలేకపోయా. ఆ రోజు రాత్రి మామిడిచెట్టు గుబురుల్లోంచి దయ్యమై వెంటాడింది. నాదబ్రహ్మ శవం పూర్తిగా కాలకుండా వదిలేసి వచ్చా. ఇంకేముంది? ఆ తర్వాత ఎన్ని అనర్థాలు జరిగాయో!"

ఈ మాటలు వింటున్నవాళ్లని భయపెడతాయి. జగ్గుపైన విశ్వాసం పెంచుతాయి. సాయంత్రం పూట గంజాయి పీలుస్తూ... మొహం గంభీరంగా పెట్టి.. అతను గొంతు సవరించుకోగానే చుట్టుపక్కల వారికి అర్థమైపోతుంది. జగ్గు తన గురించి ప్రత్యక్షంగా ఏదో చెప్పుకోబోతున్నాడని. ఒక్కోసారి వారు భయపడి అతనికి దగ్గరగా చేరుతారు. అంతగా ఆ కథలు వారిని దడిపిస్తాయి.

అంత చిన్నపల్లెలో జగ్గు ప్రశాంతంగా జీవనం సాగించటానికి ఇవన్నీ ఎంతగానో దోహదం చేస్తున్నాయి. ఆరోజు ఆకాశం మేఘావృతంగా ఉంది. జగ్గు తలనొప్పితో బాధ పడుతున్నాడు. తలకి పట్టీలాంటిది చుట్టుకుని ఇంట్లోనే ఉన్నాడు. ఆ సమయంలో గ్రామం చివరి నుంచి ఏడుపులు పెడబొబ్బలు మొదలయ్యాయి. ఊరి బయటికి పోగాకు, వక్కలు కొనుక్కోటానికి వెళ్లిన వ్యక్తి ఎవరో సమాచారం తీసుకొచ్చారు. జాతియా మా కోడలు చనిపోయిందని,

క్షణాల్లో ఈ విషయం ఊరంతా పాకిపోయింది. ఆ నోట ఈ నోట జగ్గు చెవిన కూడా పడింది. తన జేబు నిండబోతోందనుకున్నాడు.

అదే సమయంలో మృతురాలికి సంబంధించిన కొన్ని విషయాలు బయటికొచ్చాయి. ఆమె వేరెవరితోనో వివాహేతర సంబంధం పెట్టుకుందట. గర్భం రావటంతో తీయించుకొనే ప్రయత్నం చేసింది. అందుకు వాడిన మందులు వికటించి ప్రాణం పోయిందట. తన డబ్బుల సంగతి సరే. ఇలాంటి అనైతిక వ్యక్తి కర్మ చేయటం సంప్రదాయం కాదు. పైగా ఇలాంటి ధర్మ విరుద్ధమైన పని చేస్తే సాటి కాపరులు తనను వెలేస్తారని జగ్గు ఆలోచిస్తున్నాడు.

జాతియా మాకి కోడలు తప్ప వేరొకరు లేరు. పెళ్లయిన నెల రోజులకే ఆమె బిడ్డ కలకత్తా వెళ్లాడు. అప్పులు తీర్చేందుకు బాగా డబ్బు సంపాదించుకొస్తానని చెప్పి పోయాడు. మొదట్లో ఉత్తరాలు రాసేవాడు, క్రమంగా అవి కూడా తగ్గిపోయాయి. ఏమయ్యాడో... అసలు ఉన్నాడో లేదో సమాచారం లేదు. మూడేళ్లుగా వాళ్లిద్దరే ఒకరికొకరు తోడుగా మిగిలారు. ఊళ్లో వాళ్లు చెప్పుకోవటం ఏమిటంటే అతను మరో ఆమెతో కాపురం చేస్తూ అక్కడే ఉండి పోయాడని. నిజానిజాలు దేవుడెరుగు.

ఆ వృద్ధురాలిని ఒంటరి చేస్తూ ఇప్పుడు ఆ కోడలూ గతించింది. కోడలిని అదుపులో పెట్టనందుకు ఊళ్లో వాళ్లందరికీ ఆమె అంటే కంటగింపు. ఈ సమయంలో మాత్రం వారిలో మానవత వెల్లువెత్తింది. సానుభూతితో వీలైనంత త్వరగా శవాన్ని అక్కడి నుంచి తరలించటానికి సిద్ధమయ్యారు. ఏ గ్రామ సేవకుడో పోలీసుల చెవిన వేస్తే నానా రభస అవుతుంది. ఊరందరికీ అపవాదు, చెడ్డపేరు. కూతుళ్లు, కోడళ్లతో అందరం గౌరవంగా జీవిస్తున్నాం... ఇప్పుడు ఈ బెడద వచ్చి పడింది అనుకున్నారు గ్రామ పెద్దలు. గ్రామస్థులందరికీ కృతజ్ఞత చెబుతున్నట్టు జాతియా మా తల భూమిలోకి వంచి బోర్ల పడుకొని ఉంది.

దృఢకాయులు నలుగురు ముందుకొచ్చి శవాన్ని మోయటానికి సిద్ధమయ్యారు. అంతిమ సంస్కారానికి అవసరమైన సామాను సిద్ధం చేశారు మరికొందరు. ఆమె శరీరానికి కొత్త బట్ట కట్టే పని ఎవరు చేయాలా అని ఆలోచించసాగారు. అందుకు సమర్థులయిన వారి కోసం వెతుకుతున్నారు.

"ఏది ఏమైనా సాధ్యమైనంత త్వరగా శవాన్ని అక్కడ్నుంచి కదిలించాలి. పోలీసులొచ్చారంటే గొడవే. గ్రామంలో మర్యాదస్తులు ఉన్నారు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఈ పాటికే పోలీసులొచ్చుండే వారు" అనుకున్నారు.

"జగ్గుని పిలవండి. అతను లేకపోతే ఈ కార్యక్రమం సరిగా పూర్తికాదు" అని ఎవరో చెప్పారు.

పరుగున వెళ్లి అతన్ని పిలిచారు.

"ఏమిటీ? ఆ పాపాత్మురాలి శవాన్ని నేను మోయాలా? ఆమెను నేను ముట్టుకోవటమా? ఏమైనా ఉందా?" గయ్‌మన్నాడు.

గ్రామస్థులు చాలా సేపు బతిమాలారు. అనేక రకాలుగా ప్రాధేయపడ్డారు. చివరికి అన్యమనస్కంగానే కదిలాడు.

జాతియా మా దగ్గిర ఉన్న డబ్బులు కార్యక్రమానికి ఎంత మాత్రం సరిపోవు. ఓ ఐదు రూపాయలు ఇస్తే చాలు తన పని పూర్తి చేస్తానన్నాడు. ఆమె ధరించిన బంగారపు ముక్కు పుడకను తీసుకోవచ్చని అక్కడి వారు చెప్పారు. అయిష్టంగా మృతదేహాన్ని తరలించే పనికి పూనుకున్నాడు. గ్రామస్థులంతా కదిలారు. "రామ్ రామ్ సత్యహై..." నినాదాలు మిన్ను ముట్టాయి. శ్మశానం చిందర వందరగా ఉంది. పగిలిన కుండ పెంకులు, చిట్లిన పుర్రెలు, ఎముకలు, విడి భాగాలు, చీలికలు పేలికలుగా ఉన్న గుడ్డ ముక్కలు, కాలుతున్న మాంసం ముద్దల్లో నుంచి అదోలాంటి దుర్వాసన.

శవ దహనానికి అన్ని ఏర్పాట్లు చేశాడు జగ్గు. ప్రత్యేకమైన స్థలాన్ని రూపొందించాడు. ఒక క్రమపద్ధతిలో ఎత్తుగా కట్టెల్ని పేర్చాడు. శవాన్ని ఆ కట్టెల పైకి చేర్చి ఆమె ముఖానికి కప్పిన వస్త్రాన్ని తొలగించాడు. అప్పుడే మబ్బు చాటునున్న చందమామ బయటికొచ్చింది. మెత్తగా పరుచుకొన్న వెన్నెల్లో ఆమె మొహం తళుక్కున ప్రకాశించింది. ముక్కుపుడక మెరుస్తోంది. ఎందుకో తెలీదు. ఆ క్షణంలో జగ్గు అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యాడు. ఆమె ముఖంలో ప్రశాంతత, అమాయకత్వం దోబూచులాడుతోంది. నిద్రపోతున్న పసిపిల్లలా కనిపించింది.

వెన్నెలలో లిల్లీపువ్వులా వున్న ఆమె మొహం... నల్లగా మెరుస్తున్న కురులు... చంద్రుణ్ణి అంటి పెట్టుకున్న మేఘాల్లా తోచాయి. ముక్కు పుడక కోసం ముందుకు చాచిన చేతులు గాల్లో అలాగే నిలిచిపోయాయి. విభ్రాంతితో జగ్గు ఆమెనే చూస్తున్నాడు.

"త్వరగా పని పూర్తి చెయ్యి. అవతల ఆలస్యమైతే పోలీసులొస్తారు" ఎవరో అరుస్తున్నారు. జగ్గు ఆలోచనలు ఆగిపోయాయి. చెయ్యి వెనక్కి లాక్కుని తలెత్తి ఆకాశంవైపు చూశాడు. ఇంతకు ముందు ఎన్నో మృతదేహాలు చూశాడు. అవేవీ అతనిలో ఇంతటి సంచలనాన్ని కలిగించలేదు. ముక్కుపుడక లాక్కోటానికి చేతులు సహకరించటం లేదు. అంత అందమైన ముఖం నుంచి ముక్కుపుడకను వేరు చేయడానికి అతని మనస్సాక్షి అంగీకరించలేదు. అతని కళ్లకి ఆమె రూపం ఆలోచనలను ఎగదోస్తోంది.

కొద్ది రోజుల్లో ఈమె తల్లయి ఉండేది. బిడ్డల లాలనలో జీవితాన్ని సాగించేది. కానీ కాలం కనికరించలేదు. పగబట్టి ఈ లోకంలో నుంచి తరిమేస్తోంది. ఆ రాత్రి.. వెన్నెల వెలుగులో అతనిలో నుంచి ఓ కొత్త వ్యక్తి ఉదయించాడు. శవాలతో ఇంత కాలం సహవాసం చేస్తూ రాతిమనిషిలా ఉన్న వాడిలో ఏదో కదలిక.

"ఆమె జీవితాంతం ఒంటరిగానే జీవించింది. ఈ ఒక్కరోజే కాదు.. రోజులకు రోజులు.. కొత్తజీవితం కోసం, అలవాటయిన యాంత్రికతను పోగొట్టుకోటానికి మృత్యువుని చేతులారా ఆహ్వానించింది. ఇదిగో ఇలా శ్మశానికి చేరింది. ఇలా... వేనవేల ఆలోచనలు అతన్ని చుట్టుముట్టాయి. వాటిని ఎలా క్రమబద్ధం చేయాలో అర్థం కాక సతమతమవుతున్నాడు. అతను పెద్దగా చదువుకోలేదు. కానీ ఆమె ముఖంలో జీవనపోరాటం తాలూకు అలసటను కూడా పసిగట్టగలిగాడు. ఆ క్షణంలో జగ్గు తీరు చుట్టుపక్కల వారికి నచ్చలేదు. త్వరగా పని పూర్తిచెయ్యకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నాడోనని చిరాకు పడ్డారు. "ఇదిగో నువ్విక ఆలస్యం చేశావంటే శవాన్ని ఇక్కడే వదిలేసి మేం చక్కగా పోతాం. పోలీసులొస్తే ఏం చేస్తావు. ఆ ముక్కుపుడక గబగబా తీసుకో. బంగారం కోసం గోల చేసే వాడివిగా. ఇప్పుడు దాన్ని తియ్యడానికి చెయ్యి రావటం లేదా నీకు" గయ్‌మన్నారు. "నువ్వు దాన్ని తీసుకుంటే శవానికి మేమే నిప్పు పెట్టి వెళ్లిపోతాం" అని చెప్పారు. జగ్గు కల చెదిరిపోయింది. అతను సిగ్గు పడ్డాడు.

మనసులో భావాలను అణుచుకొని "ఇలాంటి వ్యక్తి నుంచి నేను బంగారం తీసుకొని వెళ్లాలా? ఛా! అంతకంటె దౌర్భాగ్యం ఇంకోటి ఉందా" అన్నాడు పైకి. "సరే నీకు అవసరం లేదా? మేమే నిప్పు పెట్టమా?" అడిగారు. "ఊ ఈ పని మీరే చెయ్యండి. ఆమె శరీరం బూడిదయ్యే వరకూ" అన్నాడు అప్రయత్నంగా. మరికాసేపటికి మంటలు గాలిలోకి లేచాయి. మెరిసిన శరీరం అగ్నికి ఆహుతయ్యింది. ముందు నల్లగా మారి క్రమంగా బూడిద కాసాగింది. సమీపంలో నిలబడే జగ్గు ఇదంతా గమనిస్తున్నాడు. ఎక్కడో దూరాన తీతువు పిట్ట అవిశ్రాంతంగా అరుస్తోంది. గుడ్లగూబల రెక్కల చప్పుడు వినిపిస్తోంది. చితినుంచి మాంసం కాలిన వాసన చుట్టూతా పరుచుకుంది.

"జగ్గూ! నువ్వు మంచి పనే చేశావు. ఆమె ముక్కుకు ధరించిన వస్తువు తీసుకోకుండా" పక్కనున్న ఎవరో అన్నారు. "ఒక వేళ నువ్వు దాన్ని తీసుకొని ఇంట్లో పెట్టుకొన్నా అది నీకంత శుభదాయకమయ్యేది కాదు. ఆమెది ఎంత బాధాకరమైన మరణం. అంత ధైర్యంగా ఎవరు మరణించగలరు? కడుపులో బిడ్డ పెరుగుతుందని తెలిసి కూడా బలవన్మరణానికి సిద్ధపడిందంటే ఆమెలో ఎంతటి తెగువ ఉందో చూశావా? అంతా దైవికం" చెబుతున్నారు.

"ఆపండి మీ వ్యాఖ్యానాలు.." చితిపైనుంచి చూపు మరలుస్తూ కోపంగా అన్నాడు జగ్గు.

"ఒక మనిషి మరో మనిషిని ఎప్పుడైనా సరిగా అర్థం చేసుకోగలడా? తెలిసీ తెలియకుండా ఒకరి గురించి ఏదో ఒకటి మాట్లాడుకోవటం, వాళ్ల ఇదీ అని నిర్ణయానికి రావటం ఏం న్యాయం" అన్నాడు. అతని మొహం ఎర్రబారింది. కోపంతో ముక్కు పుటాలదురుతున్నాయ్.

మూలకథ : ఒరియా

రచయిత : సచ్చిదానంద రౌత్ - రాయ్

అనువాదం : శ్రీసాయిపల్లవి

వికాసం

వైద్య విజ్ఞానం అభివృద్ధి చెందడంతో గర్భిణీల పాలిట వరంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఆవిర్భవించింది. గర్భిణీలను తప్పనిసరిగా స్కానింగ్ చేయించుకోమని వైద్యులు ప్రోత్సహిస్తున్నారు. తొలి స్కానింగ్ గర్భం ధరించిన మూడు నెలల్లోపే చేయించుకోమంటున్నారు. అసలు ఈ స్కానింగ్ అంటే ఏంటి? దీన్ని ఎందుకు ఉపయోగిస్తారు? దానివల్ల ఉపయోగాలేంటి? ఈ వారం వికాసంలో తెల్సుకుందాం.



స్కానింగ్ ఓ అద్భుతం!

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

అల్ట్రాసౌండ్ అంటే అతిధ్వనులు. అంటే చాలా హెచ్చు పౌనఃపున్యం గల ధ్వని తరంగాలు. తరంగాల పౌనఃపున్యాన్ని హెర్ట్జ్ అనే ప్రమాణాల్లో కొలుస్తారు. 20 హెర్ట్జ్‌లు మొదలు 20వేల హెర్ట్జ్‌ల పౌనఃపున్యం గల ధ్వని తరంగాలను మానవ చెవి గ్రహించి శబ్దాలు లేదా స్పీచ్‌గా స్వీకరిస్తుంది. 20 వేల హెర్ట్జ్‌లను మించిన పౌనఃపున్యం గల ధ్వని తరంగాలను కంపనాల ద్వారా ఒక ప్రవాహిలో పుట్టిస్తారు. ఈ తరంగాలు ప్రవాహి గుండా ఒక అడ్డును ఢీకొన్నప్పుడు అందులో కొన్ని తరంగాలు పరావర్తనం చెంది మరికొన్ని అడ్డుగుండా దూసుకుని వెళ్లిపోతాయి. ఈ తరంగాలను ఉత్పత్తి చేసిన ట్రాన్స్‌డ్యూసర్ వెనుతిరిగి వచ్చిన తరంగాలను గ్రహించగల్గుతుంది. ఈ విధంగా అడ్డుగా నిలిచిన వస్తువు ప్రతిబింబాన్ని ఈ పరావర్తన తరంగాలు ఏర్పరుస్తాయి. ఘనరూపంలో వుండే వస్తువుల ప్రతిబింబాలు కాంతివంతంగా కన్పిస్తాయి. తక్కువ సాంద్రత గల వస్తువుల ప్రతిబింబాలు నల్లగా కన్పిస్తాయి. ఈ ప్రతిబింబాలను బట్టి అడ్డుగా వచ్చిన వస్తుసాంద్రతను కూడా తెలుసుకోవచ్చు.

అతిధ్వనుల పరిణామక్రమం

గబ్బిలాలు అతిధ్వని సాంకేతిక శాస్త్రాన్ని వినియోగించుకుని ఎగురుతాయి. టైటానిక్ సముద్రంలో మునిగిపోయినప్పుడు దాని ఉనికి తెలుసుకునేందుకు ఈ అతిధ్వనుల టెక్నిక్‌ను ఉపయోగించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఈ అతిధ్వనులను ఉపయోగించి సముద్రంలో మునిగిన సబ్‌మెరైన్లను గుర్తించి నాశనం చేశారు. 1950లో స్కాట్లాండ్‌కు చెందిన ప్రొఫెసర్ లాన్ డోనాల్డ్ గర్భిణీలపై తొలిసారిగా ఈ అతిధ్వనులు ప్రయోగించి ఆమెకు స్కానింగ్ చేశాడు. ఒక స్థూపాకారపు పాత్రలో నీరు నింపి గర్భిణీని అందులో ఉంచి స్కాన్ చేశాడు. వచ్చిన చిత్రాలు నలుపు తెలుపుగా వున్నాయి. భారీ నిర్మాణం యొక్క వెలుపలి గీతలు మాత్రమే కన్పించాయి. 1870లో ప్రొఫెసర్ వెల్స్ దీనిని బాగా అభివృద్ధి పరిచి గ్రేస్కేలు రూపొందించాడు. దీనివల్ల శరీరంలోని వేరు వేరు కణాలను కూడా ఇది గుర్తించగల్గుతుంది. దీని సహాయంతో శరీరంలోని అంతర్గత అవయవాల యొక్క ప్రామాణిక చిత్రాలను తీయగలిగారు. వీటి సహాయంతో ఎవరికైనా స్కాన్ చేసినప్పుడు వారి శరీరంలోని అసాధారణాలను, రోగాలను గుర్తించగలిగేవారు.

స్కానింగ్ యంత్రాలు

తొలి రోజుల్లో ఆవిర్భవించిన స్కానింగ్ యంత్రాలు శరీర అంతర్భాగాల్లోని చిత్రాలను స్పష్టంగా, వివరంగా తీయగలిగాయి. కానీ ఈ చిత్రాలు చాలా పెద్దవిగా ఉండి, కదల్చడానికి వీలులేనివిగా ఉండేవి. కాలక్రమేణా కొత్త కొత్త స్కానింగ్ యంత్రాలు ఆవిర్భవించాయి. ఇప్పుడు వీటి సహాయంతో గర్భిణీ కడుపులోని శిశు వు వివరాల్నీ తెలుసుకోగల పరిస్థితి ఉత్పన్నమైంది. గర్భస్థ శిశువు శ్వాస, కదలికలు, గుండె కొట్టుకునే రేటు, రక్తప్రవాహ తీరు వీటన్నింటిని అధ్యయనం చేయడం సాధ్యమౌతోంది. ట్రాన్స్‌డ్యూసర్ లేదా ప్రోబ్ విద్యుత్ శక్తిని హెచ్చు పౌనఃపున్యం గల ధ్వనిగా మార్పు చెందించి ధ్వని తరంగాలను గర్భిణీ శరీరంలోకి పంపడమే గాక తిరిగి వచ్చే ప్రతిధ్వనులను అతిధ్వని ప్రతిబింబాలుగా మార్చి తెరమీద చూపించగల్గుతున్నాయి.

చిత్రం ఎలా తయారవుతుంది?

శరీరంపై ప్రోబ్ ఉంచుతారు. ఇది అతిధ్వని తరంగాలను శరీరంలోకి పంపి పరీక్ష చేయవలసిన ప్రాంతంలోకి వెళ్లి అక్కడ అడ్డులను ఢీకొని తిరిగి ప్రతిధ్వని తరంగాలుగా వెనుదిరిగి వస్తాయి. ఈ ప్రతిధ్వని ఒక చుక్కగా ఎలక్ట్రానికల్‌గా మారి తెరమీద కన్పిస్తుంది. ఇటువంటి అనేక చుక్కలు కలిసి తెరమీద చిత్రాన్ని ఏర్పరుస్తాయి. చిత్రంలోని నలుపు – తెలుపు గీతలు పరిశీలిస్తే నలుపు గీతలు ప్రవాహి తాలూకు చిత్రంగానూ, తెలుపు గీతలు ఎముకలు వంటి కణాలవిగానూ గుర్తిస్తారు.

స్కానింగ్ ఎందుకు?

గర్భిణీలకు స్కానింగ్ ఒక వరం. స్కానింగ్ వల్ల ◆ ప్రసవం ఎప్పుడు అయ్యేది తెలుస్తుంది. ◆ గర్భస్థ శిశువులో అవయవ లోపాలు ఉంటే తెలుస్తాయి. ◆ గర్భంలో ఉన్నది కవలలా, ఇంకా ఎక్కువమంది ఉన్నారా? అనే విషయం తెలుస్తుంది. ◆ గర్భస్థ శిశువుకు అంతర్గతంగా శారీరకంగా ఉండే అనేక విషయాలు తెలుస్తాయి. ◆ గర్భస్థ శిశువుకు ఉండే జన్యులోపాలు, క్రోమోజోముల్లో అసాధారణత్వం వంటివి వెల్లడవుతాయి. ◆ గర్భంలో ప్లాసెంటా స్థానాన్ని సరిచూసేందుకు స్కానింగ్ ఉపయోగపడుతుంది. ప్లాసెంటా గర్భంలో కిందికి ఉంటే గర్భాశయం నుండి బిడ్డ బయటికి వచ్చే మార్గాన్ని ఇది మూసేస్తుంది. ◆ ప్లాసెంటా ఇలా మార్గాన్ని మూసేస్తే నొప్పులు, వాటి ఫలితంగా విపరీత రక్తస్రావం జరుగుతుంది. సిజేరియన్ చేయాల్సి వస్తుంది.

జీవసంబంధిత ఫలితాలు

శక్తి ఉష్ణాన్ని విడుదల చేస్తుంది. అదే విధంగా అల్ట్రాసౌండ్ (అతిధ్వని) కూడా ఉష్ణాన్ని ఉత్పత్తి చేస్తుంది. అయితే ఈ వేడి చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి దీనివల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండవు. ◆ఈ లక్షణాన్ని ఉపయోగించి ఫిజియోథెరపిస్టులు తమ వైద్యచికిత్సలో ఈ ఉష్ణాన్ని వాడుకుంటున్నారు. ప్రసవానంతరం పెరీనియంను జాగ్రత్తగా ఉంచడంలో ఈ వైద్యచికిత్స చేస్తున్నారు. ◆స్కానింగ్‌తో రోగనిర్ణయం కోసం ఉపయోగిస్తున్న ఈ అల్ట్రాసౌండ్ పూర్తిగా క్షేమదాయకమని అనేక అధ్యయాల్లో వెల్లడయింది. దీన్ని ప్రత్యేక అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలి. ఇతర పనులకు దీన్ని వాడకూడదు. ◆స్కాన్ చేసేవారికి తగిన శిక్షణ అవసరం. తెరపై కన్పించే ప్రతి బింబాన్ని సరిగా వివరించగల నేర్పరితనం అవసరం. గర్భిణీకి స్కానింగ్ ఏ విధమైన నొప్పినీ కలుగజేయదు. ◆అల్ట్రాసౌండ్ పరికరంతో గర్భస్థ శిశువుకు రోగనిర్ణయమే కాక చికిత్స కూడా సాధ్యమౌతోంది. తల్లి గర్భస్థ శిశువుల రక్తం పొసగని రీతిలో ఉంటే శిశువులో రక్త హీనత వస్తుంది. స్కానింగ్ లో ఈ విషయం తెలుస్తుంది. ◆కొన్ని సందర్భాల్లో గర్భస్థ శిశువుకు 'బ్లాడర్' లో సమస్యలు ఎదురవుతాయి. నీరుడు బయటకు వచ్చేందుకు వీలులేక అది వెనుకను తన్ని మూత్రపిండాలకు హాని కలిగిస్తుంది. అల్ట్రాసౌండ్ పరికరంతో బ్లాడర్ నుండి బిడ్డ చుట్టూ ఉండే ద్రవపదార్థాలకు చిన్న షంట్ ఏర్పాటు చేస్తారు. ప్రసవం అయ్యేవరకు ఈ ఏర్పాటు వల్ల గర్భస్థ శిశువు మూత్రపిండాలకు హాని ఉండదు. ఆ తరువాత బిడ్డకు సంపూర్ణంగా చికిత్స చేస్తారు.

★

నిరంతరం స్మరించుకోదగిన నవల

1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఉరి దేశాన్ని కదిలించివేసింది. స్వాతంత్ర్యం కోసం దేశప్రజల సౌభాగ్యాకోసం, ఉరికంబాన్ని ముద్దాడిన ఘటన అది. 1941లో కేరళ, కర్నాటక సరిహద్దులోని కయ్యూరు రైతాంగ పోరాట వీరులు నలుగురు నవ్వుతూ ఉరికంబం ఎక్కారు. ఈ ఘటన కూడా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మద్రాసు కుట్రకేసు, కాకినాడ బాంబుకేసు, కయ్యూరు దొమ్మీకేసు ఆరు దశాబ్దాలక్రితం దేశాన్ని ఊపివేసిన ప్రజాఉద్యమాలు. మొదటి రెండు కేసుల్లో ఉరిశిక్ష ఎవరికీ పడలేదుకాని, మూడవ కేసులో నలుగురికి ఉరిశిక్ష పడింది. వారు నలుగురు విజయనాదాలు చేస్తూ ఉరికంబం ఎక్కారు. కయ్యూరు మృతవీరులు పరాయిపాలనకు, ఫ్యూడల్ అణిచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణలో ప్రాణాలను బలిదానం గావించి చరిత్రలో చిరస్మరణీయులైనారు. కేరళ ఉత్తరభాగంలో జాతీయోద్యమంలో భాగంగా రైతాంగపోరాటాలు ప్రారంభమయ్యాయి. ఈ పోరాటంలో భాగంగా కాసరగోడ్‌కు దగ్గరలోని కయ్యూరు గ్రామంలో వాస్తవంగా జరిగిన ఘటన ఆధారంగా చిరస్మరణ నవల రూపొందించబడింది. అనేక పాత్రలను వాస్తవ జీవితం నుండి గ్రహించి, కళాదృష్టిని జోడించి నవలగా రూపొందించారు 'నిరంజన'. 1941లో జరిగిన కయ్యూరు రైతాంగ పోరాటాన్ని కళ్ళారా చూసిన రచయిత 1954లో చిరస్మరణ అనే పేరుతో ఈ నవలను కన్నడ భాషలో రచించారు. 'నిరంజన' కలం పేరు, అసలుపేరు కులుకుంద శివరావు. కన్నడ వారపత్రిక ఎడిటర్‌గా పనిచేశారు. 1976లో 'మృత్యుంజయ' అనే మరో నవల కూడా రచించారు. అత్యుత్తమ నవలల్లో ఒకటిగా ఇ.యం.ఎస్. నంబూద్రిపాద్ చేత గుర్తించబడింది. నవల ప్రారంభం నుండి ముగింపు వరకు ఉద్వేగంగా సాగింది. చివరి అధ్యాయాలు పాఠకుల కళ్ళ వెంట నీళ్ళు తెప్పిస్తాయి. అనేక భాషల్లో ప్రచురించబడిన ఈ నవలను ఆచార్య తిరుమల రామచంద్ర తెలుగు అనువాదం చేశారు. అనువాదం సరళంగా బాగుంది. 1981లో ప్రచురించబడి తెలుగుపాఠకుల ఆదరణ పొందిన ఈ నవలను ప్రస్తుతం తిరిగి ముద్రించడం తెలుగు పాఠకులకు చక్కని అవకాశం.

"చిరస్మరణ" కయ్యూరు విప్లవవీరుల అమరగాథ, రచన : నిరంజన, ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, వెల : రూ. 70/-.

-కారుసాల

ప్రేమికుడి అంతరంగ 'తుపాను'

విఖ్యాత రచయిత, జర్నలిస్టు, బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు కలం నుంచి వెలువడిన ఆసక్తికరమైన సాంఘిక నవల 'తుపాను'. ఆయన ఇతర సాంఘిక నవలల మాదిరిగానే ఇది కూడా 1939-41 మధ్య కాలంలో రాసిందని అర్థమవుతోంది. 1945లో మొదటిసారిగా ప్రచురితమైన ఈ నవల మళ్లీ ఇప్పుడు సరికొత్తగా పాఠకుల ముందుకొచ్చింది. ఇది ఒక ప్రేమికుడి అంతరంగంలో చెలరేగిన 'తుపాను'. ఆ తుపానుకు అతను అక్షరరూపం కల్పించగా దాన్ని చదివిన (హీరోకు తెలియకుండా) హీరోయిన్ హృదయంలోనూ తుపాను చెలరేగుతుంది. వాళ్లిద్దరూ వివాహం చేసుకోవడంతో ఈ నవల సుఖాంతమవుతుంది. ఇందులో హీరో పేరు 'త్యాగతి'. అసలు పేరు శ్రీనాథ మూర్తి. హీరోయిన్ పేరు హేమ సుందరి. కొన్ని చోట్ల హైమవతి, హేమ కుసుమ సుందరి అనే ప్రస్తావన కూడా ఉంది. కథానాయికను త్యాగతితో పాటు నిశాపతిరావు, కల్పమూర్తి అనేవారు కూడా ప్రేమిస్తుంటారు. వీరిద్దరికీ కూడా అసలు పేర్లు వేరే ఉన్నాయి. అయితే హీరో త్యాగతి హీరోయిన్‌కు సొంత బావే అవుతాడు. అంటే అక్క భర్త. ఆమె చిన్న వయసులోనే ఏదో జబ్బు చేసి చనిపోతుంది. భార్య మరణంతో త్యాగతి మతి చలించినవాడిలా ఉత్తర భారత దేశమంతా తిరుగుతాడు. భార్య చనిపోయాక స్త్రీ ప్రేమ కోసం పరితపిస్తుంటాడు. తన పర్యటన, అందులోని అనుభవాలను పుస్తకంగా (రాత ప్రతి) రాస్తాడు. దాన్ని హీరోయిన్ చదవి ఇతను తన అక్క భర్తేనని తెలుసుకుంటుంది. మొదటి నుంచి స్నేహితుడిగా అభిమానిస్తున్న అతన్నే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. నవల అంతా త్యాగతి అంతరంగ కథనమే. ఇది చదువుతుంటే ట్రావెలాగ్ చదివిన అనుభూతి కలుగుతుంది. ఇందులో కథానాయకుడు తనకు ఎదురైన వ్యక్తులను, వారితో తన అనుభవాలను వర్ణిస్తాడు. చాలా విషయాలు వివరిస్తాడు. ఈ నవలలో అక్కడక్కడా రెండో ప్రపంచం గురించిన సంగతులు, ఆనాటి రాజకీయాలు కూడా పాత్రల మధ్య సంభాషణల రూపంలో ప్రస్తావనకు వస్తాయి. మొత్తం మీద బాపిరాజుగారి శైలి కూడా తుపానులా వేగంగా చదివిస్తుంది. హీరో త్యాగతితో పాటూ పాఠకులూ పర్యటిస్తున్నట్లుగానే ఉంటుంది.

తుపాను- అడివి బాపిరాజు, వెల: రూ.150, పేజీలు-275, ప్రతులకు- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

-ఎం నాగేందర్



శ్రీ మదశోక చరిత్రము (శ్రీశాంతి సామ్రాట్లు - అశోక చరిత్రము) శ్రీ కల్లూరు వేంకట నారాయణ రావు వెల: 150/-, పేజీలు : 264 ప్రతులకు : సేవికా రత్న రొద్దం మొదలి సుబ్బలక్ష్మమ్మ కేరాఫ్ శ్రీ ఓరగంటి శివరామకృష్ణ 3/119, ఏడవ క్రాసు, మూడవ రోడ్డు, న్యూటౌను, అనంతపురం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, సాహిత్య నికేతన్, నవోదయ బుక్‌హౌస్.	**ఆ సందుక** డా॥మసన చెన్నప్ప వెల: 50/-, పేజీలు : 88 ప్రతులకు : ప్రమీలా ప్రచురణలు 9-76/2, ఉదయనగర్ కాలనీ, బోడుప్పల్, హైదరాబాద్ -39	**జిజ్ఞాస తరంగాలు** వేల్పూరి కామేశ్వరరావు వెల : 50/-, పేజీలు : 111 ప్రతులకు : వి. కామేశ్వరరావు రిటైర్డ్ జోనల్ సెక్రటరీ, ఎ.ఐ.ఆర్.ఎమ్.ఎస్.ఎ, ఎ.ఊ.ఆర్.ఇ.సి ఎడిటర్ & పబ్లిషర్ రెయిల్ శక్తి ఇం.నెం.73, రెయిల్ విహార్ లింగంపల్లి, హైదరాబాద్ - 19.	**అడవిలో వెన్నెల** (గిరిజన పోరాట కథలు) సమగ్ర పరిశీలన జరుపుల రమేష్ వెల: 70/-, పేజీలు : 117 ప్రతులకు : జరుపుల రమేష్ రీసెర్చ్ స్కాలర్ ఎమ్.హెచ్.ఇ, ఎన్.ఆర్.ఎస్. హాస్టల్, రూం.నెం: 102 యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్-46.

ఎవరు కనిపించారు?

చిన్నారులూ... కింది బొమ్మలో ఎవరు కనిపించారు? కుర్చీలో కూర్చున్న యజమాని ఒళ్లో పిల్లి పిల్ల ఉంది. ఆయన తన పనివాడికి ఏదో ఆదేశిస్తున్నాడు. అది నిజమే కానీ కాస్త పరిశీలనగా చూసి ఏం కనిపిస్తుందో చెప్పండి.





ఎక్కడున్నాయో...

బుజ్జాయిలూ... ఇక్కడున్న బొమ్మని చూశారుగా. చాలా బాగుంది కదా. అయితే ఈ బొమ్మకి రెండు పక్కలా కొన్ని వస్తువులు వున్నాయి. అవి ఈ బొమ్మలో ఎక్కడున్నాయో వెతికి పట్టుకుంటారా.



మంచి నేస్తం మైనా



మైనా పక్షి సుమారు 23 సెంటీమీటర్లు పొడవు ఉంటుంది. చూడ్డానికి పిట్ట కన్నా పెద్దగా, పావురాయి కంటే చిన్నగా ఉంటుంది. దీని శరీరం గోధుమ రంగులో ఉండి తల నల్లగా ఉంటుంది. కళ్లూ, ముక్కూ పసుపు రంగులో మెరుస్తున్నట్లు ఉంటాయి. కళ్ల చుట్టూ పసుపు పచ్చని రంగు పులిమినట్లు ఉంటుంది. ఈ పక్షి ఎగిరేటప్పుడు గమనిస్తే దాని రెక్కల మీద తెల్లని మచ్చ కనిపిస్తుంది. దీనికి స్నేహస్వభావం ఎక్కువ. ఏ పక్షితోనైనా ఇట్టే కలిసి స్నేహం చేస్తుంది. అయితే కాకులు, పిచ్చుకలు, రామ చిలుకలు, పావురాళ్లతో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది సర్వభక్షకి. అంటే రావి, మర్రి చెట్ల పండ్లనూ తింటుంది. అలాగే కీటకాలను, చిన్న చిన్న పురుగులనూ తింటుంది. ఎండుగడ్డి, చెత్తా చెదారం, పేపర్లతో గూటిని నిర్మించుకుంటుంది. చెట్ల తొర్రల్లో, ఇంటి చూరుల్లో, గోడకున్న కన్నాల్లో గూటిని కట్టుకుంటుంది. ఇది ఒకేసారి నాలుగైదు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లు నీలి రంగులో మెరుస్తుంటాయి.

ఎన్ని రోజుల్లో బయటపడుతుంది?

అనగనగా ఒక కప్ప వుంది. అది ఓసారి 10 అడుగుల లోతైన బావిలో పడిపోయింది. ఎలాగైనా సరే బయటికి రావాలనుకొంది. ఎంతో పట్టుదలగా ఒక రోజంతా ప్రయాణం చేస్తే అది మూడు అడుగులు మాత్రమే పైకి వెళ్లగలిగేది. రాత్రికి నిద్రపోవాలి కదా. ఆ నిద్రలో మళ్లీ 2 అడుగులు కిందకి జారేది. బావిలోంచి బయటికి రావడానికి కప్పకు ఎన్ని రోజులు పడుతుంది?



ఆరు భాగాలు చేయగలరా?



ప్రతి గడియారంలోనూ 12 అంకెలుంటాయి కదా. గడియారాన్ని ఆరు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో రెండు అంకెలుండాలి. ప్రతి భాగంలోని అంకెల సంఖ్య సమానంగా ఉండాలి. ఇంకో విషయం ఏంటంటే దీన్ని ఆరు భాగాలు చేసేటప్పుడు ఏ ఆకారంలోనైనా ఉండొచ్చు. సరేనా. ఇది ఎలా సాధ్యం?

ఆరు భాగాలు చేయగలరా?



ఎన్ని రోజుల్లో బయట పడుతుంది?: కప్ప 8 రోజుల్లో బావి బయటకు వస్తుంది. ఎలాగంటే రోజుకు అది మూడు అడుగులు నడుస్తుంది. రెండు అడుగులు జారుతుంది. అంటే రోజుకి అది అడుగు దూరం మాత్రమే ఎక్కగలుగుతుంది అనుకుందాం. అంటే వారం రోజులు ప్రయత్నిస్తే అది ఏడు అడుగులు పైకి వస్తుంది. 8వ రోజున పగలంతా అది పైకి పాక్కుంటూ వస్తుంది. రాత్రికి నిద్రపోకుండా గబుక్కున బావి బయటికి...అంటే నేలమీదకి దూకేస్తుంది. అంటే మొత్తం 8 రోజుల్లో అది బయటకు వచ్చేస్తుంది. **ఎవరు కనిపించారు?:** పుస్తకాన్ని రెండు చేతులతో పట్టుకుని దూరంగా పెట్టి చూడండి. ఒక పక్కకు తిరిగిన పులి ఆకారం కనిపిస్తుంది.

మాటల కోట - 45

రూపకల్పన : కర్లపాలెం

1		■	2		■	3	4	■
	■	5		■	6	■	7	8
	■		■	9		■	■	
■	10	■	11		■	12	■	■
13		■	14		■	15		■
■	■	16		■	17	■	■	18
19	■		■	20		■	21	
22	23	■	24		■	25	■	
26			■	■	27			■

నిలువు :

1. వేడన్నంలో దీనికి నెయ్యి జోడించి తింటే అదిరిపోతుంది (3)
2. కుదిరితే ... కాఫీ! (2)
4. పేరుకోసం ఆరాటం – అంటే దీని కోసం కాంక్ష (2)
5. చెల్లాయి (2)
6. పాటకీ ఇంటికి కూడా కావాలి (2)
8. సీసా నోటికి వేసేది (2)
9. పురాణాల్లో శకుంతలకే కాదు, ఇప్పటి వరుణ్ గాంధీకి తల్లి (3)
10. నరసరావు పేటలోని బస్తీ (2)
11. తూచే రాజు (3)
12. అభిమానులకు చిరంజీవి (2)
16. దీనితో పోయేదానికి గొడ్డలి ఎందుకు? (2)
17. పకోడీలో కొక్కొరొకో (2)
18. విజయావారి సూపర్ డూపర్ హిట్టయిన పంతులమ్మ (3)
19. తెలుగు సంవత్సరాది (3)
20. దెబ్బ (2)
23. తిరగబడినా పదును పదునే (2)
25. మనిషికే కాదు తాళానికీ కావాలి (2)

అడ్డం :

1. పెళ్లి పేరంటాలకు ఆడవారు ఇష్టపడి కట్టుకునేవి ఈ చీరలే! (2)
2. కత్తి కన్నా గొప్పది (2)
3. అసాంజే – లీక్స్ (2)
5. పాదరక్షను తెలుగులో ఏమంటారో చెప్పు!(2)
7. తిరగబడిన ప్రతిమ (2)
9. పెళ్ళిళ్లలో వినబడేది (2)
11. తపనలో ముందువెనుకా! (2)
13. కోటప్పకొండలో రాజనివాసం (2)
14. రావడం (2)
15. రోట్లో చేసేది. పిల్లలు పరీక్షలప్పుడు ఈ పని చేస్తుంటారు (2)
16. పేపర్లు అతికించే పేస్టు (2)
20. వాడితో పాటు వచ్చే కాక (2)
21. దేశభాషలందు తెలుగు (2)
22. అత'గాడి'ని దారిలో పెట్టండి! (2)
24. ఇప్పుడు ఎన్నికల్లో నోటుకి... (2)
26. వ్యాపారంలో పూర్తిగా నష్టపోవడం (3)
27. మిస్సమ్మ అనగానే గుర్తొచ్చే మహానటి (3)

మాటలకోట - 44జవాబు

1 తా	2 జా	■	3 చ	4 ద	5 రం	గం	■	6 శ్రీ
■	7 నా	8 డా	■	9 వా	గు	■	■	■
10 ర	■	11 బా	12 ట	■	■	13 లా	■	14 వ
15 వి	16 త్తు	■	17 పా	ల	18 న	■	19 మీ	సం
20 తే	మ	■	కా	■	ద	■	21 రా	త
జ	■	22 అ	య	స్కాం	త	23 ము	■	ము
■	24 న	త్త	లు	■	■	25 ని	26 జం	■
27 అ	మ్మ	మ్మ	■	28 దా	29 గో	■	30 కు	31 డి
32 ర	కం	■	33 ఆ	ది	వా	రం	■	స్కో

ముగ్గురు అక్కచెల్లెళ్లు



- కె.సాహిల్

జరిగినకథ: ఓ అడవిలో ముగ్గురు అక్కచెల్లెళ్లు నివసించేవారు. వారిలో ఒకరు ఒక్కంటి, మరొకరు ముక్కంటి. అందరికి మల్లే రెండు కళ్లున్న మధ్యలో అమ్మాయంటే మిగతా ఇద్దరికి అసూయ. అందుకే పనంతా ఆమెతో చేయిస్తూ, తాము తినగా మిగిలిన చద్ది పదార్థాలను ఆమెకు ఇచ్చేవారు. వారు పెట్టే కష్టాలు భరించలేక అడవికి వెళ్లినప్పుడు ఏడుస్తుంటే ఓ ముసలమ్మ కనిపించింది. ఆమె ఈ అమ్మాయి కథంతా తెలుసుకుని ఒక పాట నేర్పింది. ఆ పాట పాడితే కావాల్సిన ఆహారాన్నిస్తుంది మేక. అలాగే మరో పాట పాడితే అక్కచెల్లెళ్లకు నిద్ర వస్తుంది. ఓసారి తనను రహస్యంగా అనుసరిస్తున్న అక్కయ్య వినేలా పాట పాడింది. ఆ తర్వాత...

అంతే ఆమెకు నిద్ర ముంచుకు వచ్చేస్తుంది. అప్పుడు రెండో అమ్మాయి సంతోషంగా మేకను ఆహారం అడుగుతుంది. మేక ఇవ్వగానే తినేస్తుంది. తర్వాత మిగిలిపోయిన పదార్థాలను కూడా పాట పాడి మాయం చేసేస్తుంది. తర్వాత అక్కను నిద్ర లేపి ఇంటికి తీసుకెళుతుంది. మధ్యాహ్నం కడుపు నిండిపోవడంతో ఆ రాత్రికి వారు పెట్టిన చద్ది అన్నం తినదు. దాంతో వారికి మరలా అనుమానం వస్తుంది. అప్పుడు మూడో అమ్మాయి మొదటి అమ్మాయిని

"అక్కా నువ్వు దానికి సరిగా కాపలా కాశావా లేదా? చూడు అది మనం విదిలించిన మెతుకుల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. అక్కడేదో బాగా తిని వచ్చినట్టుంది" అంటుంది అనుమానంగా, కోపంగా.

"చెల్లీ! నీ మీద ఒట్టు. నేను మామూలుకంటే చాలా జాగ్రత్తగా వున్నాను. కాకపోతే అది పాట పాడిన వెంటనే నాకు నిద్ర ముంచుకు వచ్చేసింది. నిద్రపోయాను. మళ్లా అది లేపే వరకు నాకు మెలకువ లేదు. అంతకు మించి నాకేమీ తెలియదు" అంది నీరసంగా.

"సర్సరి. రేపు నేను వెళతాను. నాకు మూడు కళ్లు. వాటితో జాగ్రత్తగా కాపలాకాసి దాని గుట్టు రట్టు చేస్తాను. చూస్కో" అంటుంది గొప్పగా.

మరునాడు రెండో అమ్మాయి మేకలను తీసుకొని వెళ్లినప్పుడు మూడో అమ్మాయి కూడా రహస్యంగా వెళుతుంది. ఈ విషయం రెండో అమ్మాయి రహస్యంగా కనిపెడుతూనే వుంటుంది. అయితే మధ్యాహ్నం అయ్యాక మామూలుగా చెల్లెలి దగ్గరకెళ్లి...

"చెల్లీ...చెల్లీ...నీ ముద్దుల అక్క పాట పాడుతోంది. నిద్ర పో చెల్లి..." అంటూ పాట పాడుతుంది. అంతే చెల్లెలికి నిద్ర వస్తుంది. కానీ నుదుటి మధ్యలో వున్న కంటికి మాత్రమే నిద్ర వస్తుంది. మిగతా రెండు కళ్లూ మామూలుగానే పనిచేస్తుంటాయి. అయినా అక్కకు అనుమానం రాకుండా ఆ రెండు కళ్లు కూడా మూసుకుని పడుకుంటుంది. కానీ రహస్యంగా... తన అక్క మేకనడిగి రుచికరమైన పదార్థాలను తెప్పించుకొని తినడం...మిగిలిన వాటిని మాయం చేయడం చూస్తుంది.

ఆ రాత్రికి ఏమీ తెలియనట్టే ఇంటికి చేరుతుంది. తన అక్కతో ఈ విషయాలన్నీ చెప్తుంది. అయితే అంతా కనిపించిందికానీ మేకను ఆమె ఏమడిగిందో మాత్రం వినపడలేదంటుంది.

"ఆ రెండుకళ్ల పొగరుబోతుకు ఏవో మంత్రాలు వచ్చనుకుంటా. పైగా మేక వల్లే కదా తనకు ఆహారం అందుతోంది. అందుకే మేకను అడవిలోకి తరిమేద్దాం" అనుకుంటారు. అన్నంతపనీ చేస్తారు. తర్వాత రెండో అమ్మాయి ఏడుస్తూ అవ్వకు ఆ విషయం చెప్తుంది.

అప్పుడు అవ్వ "ఓస్! పిచ్చి పిల్లా! ఆ పాట మొదటి అమ్మాయికి మాత్రమే పనిచేస్తుంది. ఇప్పుడు నీకో ఉపాయం చెప్తాను" అంటూ కొన్ని గింజలు ఇస్తుంది. వాటిని ఇంటి ముందు చల్లమంటుంది.

ఆమె చెప్పినట్టుగానే చల్లుతుంది. ఆ విత్తుల నుంచి ఓ యాపిల్ మొక్క వస్తుంది. మొక్క చాలా త్వరగా చెట్టులాగా ఎదిగిపోతుంది. దానికి వెండిలా తళతళా మెరిసిపోయే ఆకులు, బంగారు యాపిల్ పళ్లు వుంటాయి. అవి చూసినవారికి తెగ నోరూరిపోతుంది.

కానీ రెండో అమ్మాయికి తప్పించి మరెవరికీ ఆ కాయలు అందవు. ఎంత అందుకుందామన్నా అవి మరింత ఎత్తుకు పోతుంటాయి.

★★★

ఓసారి ఓ రాజకుమారుడు అటుగా వస్తాడు. ఆ చెట్టును చూడగానే అతనికి ఒక యాపిల్ తినాలనిపిస్తుంది. అతణ్ణి చూచి ఒక్కంటి, ముక్కంటి చాలా సంతోషిస్తారు. అతణ్ణి పెళ్లిచేసుకోవాలనుకుంటారు. కానీ రెండో అమ్మయిని చూశాడూ అంటే తమను చచ్చినా పెళ్లాడడని వారికి తెలుసు. అందుకే వెంటనే ఆమెను ఓ గదిలో బంధించేస్తారు.

అతను ఇంటి దగ్గరగా వచ్చి యాపిల్ పండు ఒకటి ఇమ్మంటాడు. ఎంత కోయబోయినా ఇద్దరికీ అందవు. అప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో రెండో అమ్మాయిని బయటికి తీసుకొస్తారు. ఆమె చెట్టు దగ్గరకెళ్లి...

"యాపిల్ చెట్టూ ... యాపిల్ చెట్టూ...నేను రెండు కళ్ల అమ్మాయిని. నాకు ఒక పండునివ్వవూ..." అంటుంది చెయ్యి చాచి.

చక్కగా ఓ యాపిల్ పండు వచ్చి అమ్మాయి చేతిలో పడుతుంది. అది రాజకుమారుడికి ఇస్తుంది. అతను ఆ పండు తిని చాలా సంతోషిస్తాడు. అంతేకాదు. తనకు ధన్యవాదాలు చెప్పి ఏదైనా కోరుకోమంటాడు.

ఆమె తనను ఈ కష్టాల కడలి నుంచి బయటకు తీసుకెళ్లమంటుంది. అంతే ఆమెను కూడా తన వెంట రాజ్యానికి తీసుకెళతాడు.

ఒక్కంటి, ముక్కంటి మాత్రం అక్కడే వుండిపోతారు. రెండో అమ్మాయి లేకపోవడంతో ఇంటి పనంతా చేసుకోవాల్సి వచ్చేసరికి రోజూ ఒకరినొకరు తిట్టుకుంటూ...తన్నుకుంటూ వుంటారు. అయితే రెండు రోజులకోసారి యాపిల్ చెట్టు దగ్గరకొచ్చి

"యాపిల్ చెట్టూ...యాపిల్ చెట్టూ...నేన రెండు కళ్ల అమ్మాయిని...ఒక యాపిల్ పండునివ్వవూ" అంటుంటారు. కాని ఒక్కసారి కాకపోతే ఒకసారి కూడా చెట్టు నుంచి ఒక్క పండు కూడా రాలదు.

*

టెడ్డీబేర్ మ్యూజియం

దక్షిణ కొరియాలో జిజు మ్యూజియంలోకి అడుగెట్టామా! అంతే సంగతులు!! మనం ముందుకు నడుస్తూనే వుంటాం. కళ్లు చూస్తూనే వుంటాయి. కానీ నోటెంట మాటే రాదు. మరి ఎలా వస్తుందండీ. అక్కడ అన్ని టెడ్డీబేర్ బొమ్మలుంటే. వావ్... ఒకటా రెండా!! వందలాది టెడ్డీబేర్ బొమ్మలు ముద్దు ముద్దుగా ఆహ్వానిస్తాయి. బుల్లి టెడ్డీబేర్ నుంచి పెద్ద టెడ్డీబేర్ వరకూ బోలెడన్ని రకాలున్నాయి. అతి చిన్న టెడ్డీ బేర్ బొమ్మ పొడవెంతో తెల్సా. 4.5 మిమీ. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వారిని పోలిన టెడ్డీబేర్లూ ఇక్కడ దర్శనమిస్తాయి. గాంధీ, ప్రెస్లీ, మార్లిన్ మన్రో, ఆల్బర్ట్ ఐన్‌స్టిన్, మదర్ థెరిస్సా, మొనాలిసా... దుస్తులు వేసుకున్న బొమ్మలు సందర్శకులకు కన్నుల పండుగ చేస్తాయి. మ్యూజియం ఏడాదికి 365 రోజులూ తెరిచేవుంటుంది. తిలకించడమే తరువాయి.